1st Year Happy Work Anniversary.

షణ్ముఖ వెలుగు

RNI : APTEL / 2023 / 89152

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

Good for Health — Best for Readers — THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 120 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 14 మార్చి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 120 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 14 Marchi 2025 PAGES : 8 PRICE : 5/-


# ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు



- 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు
- తొలుత 26 జిల్లాల్లో ఏర్పాటు
- 10 కొత్త ప్రాజెక్టుల ద్వారా 80,104 మందికి ఉద్యోగాలు
- ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు
- ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు

**అమరావతి**

రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన, ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టుల పురోగతిపై నిత్యం పరిశీలించాలని... దీని కోసం ట్రాకర్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సిఎం ఆదేశించారు. గురువారం సచివాలయంలో తన అధ్యక్షతన జరిగిన 4వ ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్రానికి కొత్తగా వస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలను పరిశీలించారు. పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం వంటి రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.1,21,659 కోట్లు పెట్టుబడులు ముందుకురాగా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 80,104 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. అలాగే, గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులు, వాటి పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ చొప్పున మొత్తం - మిగతా3లో




## విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చింది టీడీపీనే

- కొన్నేళ్లుగా విద్యుత్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి
- గతంలో కరెంటు కోతల సమయంలో రైతుల అవస్థలు ప్రత్యక్షంగా పరిశీలించా
- రైతుల ఇబ్బందులు చూసాక పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించుకున్నా
- విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ప్రపంచ బ్యాంకు జీతగాడని అవహేళన చేశారు

**అమరావతి**

ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా విద్యుత్ వినియోగం ఆధారంగానే ప్రజల అభివృద్ధిని లెక్కిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ శాసనసభలో విద్యుత్ రంగంపై లఘు చర్చలో సీఎం మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా విద్యుత్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. గతంలో కరెంటు కోతల సమయంలో రైతుల అవస్థలు ప్రత్యక్షంగా పరిశీలించానని.. రైతుల ఇబ్బందులు చూసాక పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించుకున్నామని - మిగతా3లో



## మావోయిస్టుల లొంగుబాటు

- 17 మంది మావోయిస్టులు లొంగుబాటు
- గంగుళూరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున లొంగిపోయిన మావోయిస్టులు
- లొంగిపోయిన వారికి పునరావాస పథకం కింద ఒక్కొక్కరికి రూ. 25 వేల రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతి

# అన్నిదార్లు పిఠాపురం వైపే



- నేడే జనసేన ఆవిర్భావ సభ
- 1600 మంది పోలీసులతో భారీగా బందోబస్తు
- రాష్ట్రం నలు వైపుల నుంచి వచ్చే వారికి ప్రత్యేక ఏర్పాట్లు
- ఆహారం, మంచినీరు అందరికీ అందేలా చర్యలు
- సభా స్థలంలో 12 అంబులెన్సులు, మెడికల్ బృందాలు సిద్ధం
- మహిళలకు ప్రత్యేక గ్యాలరీలు, సౌకర్యాలు
- శుక్రవారం సాయంత్రం 3.30 గంటల నుంచి సభ మొదలు

**కాకినాడ**

పిఠాపురం జనసేన పార్టీకి ఎన్నో మరుపురాని జ్ఞాపకాలు ఇచ్చింది. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం జయకేతనం సభకు కూడా పిఠాపురం వేదిక అయింది. ఈ సందర్భంగా పిఠాపురం ప్రజలకు నిండు మనసుతో కృతజ్ఞతలు చెప్పుకొందాం.. థాంక్యూ పిఠాపురం అని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని న భూతో అన్న రీతిలో నిర్వహిస్తున్నామని, దీనికి పార్టీలోని ప్రతి ఒక్కరూ మమేకం కావాలని పిలుపునిచ్చారు. జనసిన పార్టీ ఆవిర్భావ దినోత్సవం "జయ కేతనం" సభ ఏర్పాట్లను నాదెండ్ల మనోహర్ - మిగతా3లో



## 144 కోట్లు దాటిన భారత జనాభా

- మరో 77 ఏళ్లలో భారత జనాభా 2011 లెక్కల ప్రకారం రెట్టింపు
- పదేళ్లుగా ఇండియాలో శిశు మరణాలు బాగా తగ్గాయి
- 2011లో జరిపిన జనాభా లెక్కల ప్రకారం భారత జనాభా 121 కోట్లు.
- తాజాగా విడుదల చేసిన ఐక్యరాజ్యసమితి జనాభా నిధి




## చంద్రయాన్-4కి మార్గం సుగమం!

- విజయవంతంగా స్పాడెక్స్ శాటిలైట్స్‌ని అన్‌డాక్ చేసిన ఇస్రో!
- అంతరిక్షలో ఉపగ్రహాలను కలిపే ప్రక్రియను డాకింగ్‌గా పిలుస్తారు
- వాటిని మళ్లీ వేరే చేసే ప్రక్రియనే అన్‌డాకింగ్ అంటారు.
- ఇది ప్రతి భారతీయుడికి సంతోషకరమైన విషయం

## విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేయాలి



- ఈ నెల 14న చేపట్టనున్న నిరసనలకు సీపీఐ మద్దతు ఇవ్వాలి
- పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**అమరావతి**

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం ఫ్యాక్టరీకి సొంతంగా గనులు కేటాయించి, సెయిల్ విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనలకు సీపీఐ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రకటించారు. ఈ మేరకు నిసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ శ్రేణులకు - మిగతా3లో

## రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన..

- గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- అన్ని పనులు తెలుగుదేశం వారికే చేయాలి
- వైఎస్సార్‌సీపీ వారికి ఏ పనీ చేయకూడదు
- అలా చేస్తే పాముకు పాలుపోసినట్లేనంటూ చేసిన తీవ్ర వ్యాఖ్యలను గవర్నర్ దృష్టికి తీసుకువచ్చాం
- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన సాగుతున్న నేపథ్యంలో తక్షణం గవర్నర్ జోక్యం చేసుకోవాలి



**విజయవాడ**

రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం రాజ్‌భవన్‌లో కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన సాగుతున్న నేపథ్యంలో తక్షణం గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరింది. అనంతరం రాజ్‌భవన్ బయట పలువురు మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ఇటీవల గంగాధర నెల్లూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అన్ని పనులు తెలుగుదేశం వారికే చేయాలి.. వైఎస్సార్‌సీపీ వారికి ఏ పనీ చేయకూడదు.. అలా చేస్తే పాముకు - మిగతా3లో

# ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు



-మొదటిపేజీ తరువాయి

175 నియోజవకర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందలో భాగంగా మొదట జిల్లాకు ఒకటి చొప్పున 26 జిల్లాల్లో తక్షణం 26 ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెలరోజుల్లోగా రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో 5 సెంటర్లు నెలకొల్పాలని చెప్పారు. పెట్టుబడులు గ్రౌండ్ అయ్యే వరకు ఆయా సంస్థల వెనుకపడాలని.... నిరంతరం ఫాలోఅప్ చేయాలని సిఎం సూచించారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు... క్షేత్ర స్థాయిలో ఆయా ప్రాజెక్టులు పనులు మొదలుపెట్టేలా చూడాలన్నారు. ఈ విషయంలో అటు మంత్రులు, ఇటు అధికారులు మరింత వేగంగా పనిచేయాలని సిఎం సూచించారు. అప్పుడే ప్రతి ఏడాది ప్రగతి, ఫలితం కనిపిస్తుందని సిఎం అభిప్రాయపడ్డారు.

**4వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన సంస్థల వివరాలు ఇలా..**

ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ : నాయుడుపేట %-% రూ.1,742 కోట్ల పెట్టుబడులు, 2,000 ఉద్యోగాలు. దాల్మియా సిమెంట్ : కడప జిల్లా %-% రూ.2,883 కోట్ల పెట్టుబడులు, 354 ఉద్యోగాలు. లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్ : విశాఖపట్నం %-% రూ. 1,500 కోట్ల పెట్టుబడులు. సత్యవీడు రిజర్వ్ ఇన్ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ %-% రూ. 25,000 కోట్ల పెట్టుబడులు, 50,000 ఉద్యోగాలు. ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.58,469 కోట్ల పెట్టుబడులు, 13,050 ఉద్యోగాలు. బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.1,175 కోట్లు, 1,500 ఉద్యోగాలు. ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు %-% రూ.22,000 కోట్ల పెట్టుబడులు, 8,300 ఉద్యోగాలు. ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : అన్నమయ్య, కడప జిల్లాలు %-% రూ.8,240 కోట్లు, 4,000 ఉద్యోగాలు. మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్, కన్వెన్షన్ : రూ. 400 కోట్ల పెట్టుబడులు, 750 ఉద్యోగాలు. ఒబేరేయ్ విలాస్ రిసార్ట్ : రూ. 250 కోట్ల పెట్టుబడులు, 150 ఉద్యోగాలు రానున్నాయని సీఎం వెల్లడించారు.

# విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చింది టీడీపీనే



-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ప్రపంచ బ్యాంకు జీతగాడని అవహేళన చేశారన్నారు. అప్పుడే డిస్కమ్‌లు, నియంత్రణ మండలి, ఎనర్జీ ఆడిటింగ్ అనేది మొదలు పెట్టామన్నారు. గతంలో ట్రాన్స్ మిషన్ నష్టాలు 23 శాతం అని దేశంలో తొలిసారి నిర్ధారించింది కూడా ఏపీనే అని అన్నారు. విభజన తర్వాత కరెంటు కోతలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దామని తెలిపారు. టీడీపీ హయాంలో చేసిన విద్యుత్ సంస్కరణలు వాడుకుని అప్పట్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు.

**రాష్ట్ర విభజన సమయంలో..**

ఎన్టీపీఎస్ లాంటి ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను 83 శాతం పీఎల్ఎఫ్‌తో నడిపించామన్నారు. చాలా ప్రైవేటు సంస్థలకూ అది సాధ్యం కాదని.. ఈ పరిపాలనా మార్పులు ప్రజలు గుర్తించాలన్నదే తమ అభిప్రాయమన్నారు. గత 30 ఏళ్ల పాలనా సమయాన్ని బేరీజు వేసుకుంటే వాస్తవాలు వెలుగు చూస్తాయని తెలిపారు. విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఉన్న ఏపీని లోటు పరిస్థితికి తీసుకెళ్లింది వైసీపీ ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. పరిశ్రమలు కరెంటు వాడితే సర్చార్జి విధించిన పరిస్థితి గత ప్రభుత్వానిదన్నారు. 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత రాష్ట్ర విభజన సమయంలో ఉందన్నారు.

**ఓ వ్యక్తి ఈగోకు..**

2018 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దామని తెలిపారు. ఏపీలో తలసరి విద్యుత్ వినియోగం 23 శాతం మేర పెరిగిందన్నారు. సౌర, పవన విద్యుత్‌ను 7700 మెగావాట్లు మేర ఉత్పత్తి చేసిన మొదటి రాష్ట్రం ఏపీనే అని చెప్పుకొచ్చారు. అయితే 2019-24లో అసమర్థ పాలన వల్ల రాష్ట్రంలో మళ్లీ చీకటి రోజులు వచ్చాయన్నారు. ఆలోచన లేకుండా వైసీపీ పీపీఏలను రద్దు చేసేసిందన్నారు. పీపీఏల రద్దు విషయం అంతర్జాతీయ అంశంగా మారిపోయిందన్నారు. దావోస్ లాంటి చోట కూడా పీపీఏలను రద్దు చేయటంపై చర్చ జరిగిందని తెలిపారు. ఒక వ్యక్తి ఈగో కారణంగా రాష్ట్ర ఖజనా నుంచి రూ.9 వేల కోట్లు పీపీఏలకు చెల్లించాల్సి వచ్చిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆలస్యం వల్ల అందులో జల విద్యుత్ కేంద్రం ఆగిపోయి 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రాలేదన్నారు. వైసీపీ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీల పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం వేశారని మండిపడ్డారు.

**విద్యుత్ వ్యవస్థపై వైసీపీ వేసిన భారం..**

టారిఫ్ అడ్జస్ట్‌మెంట్, ఫ్యూయల్ సర్చార్జ్ , ట్రూ ఆప్ ఛార్జెస్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ అని చెప్పి రూ. 32,166 కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ వినియోగం కూడా 4.6 శాతం మేర తగ్గిపోయిందని చెప్పారు. వినియోగదారులు, విద్యుత్ వ్యవస్థపైనా గత ప్రభుత్వం వేసిన భారం రూ.1 లక్ష కోట్లు అని తెలిపారు. విద్యుత్ రంగంలో వారసత్వంగా కొన్ని సమస్యలు కూటమి ప్రభుత్వానికి వచ్చాయన్నారు. సెకీ ద్వారా చేసుకున్న పవర్ సప్లై అగ్రిమెంటు రాష్ట్రానికి భారంగా మార్చేశారన్నారు. ఒకసారి సంతకాలు చేసిన తర్వాత ప్రభుత్వంగా దాన్ని వెనక్కు తీసుకోలేమన్నారు. ఇలాంటి ఇబ్బందులు ఉన్నా వాటిని సరిచేసేందుకు ప్రయత్నాలు కూటమి ప్రభుత్వం చేస్తోందని వెల్లడించారు. భూతాపం వల్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కోసం ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయన్నారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ, బయోఫ్యూయెల్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను స్మార్ట్ గ్రిడ్ ద్వారా సరఫరా చేయాలని ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

**ప్రతీ ఇంటిపై సోలార్ ఫలకాలు...**

విద్యుత్ రంగం విస్తృతంగా పెరిగినందున వ్యయం అనేది గణనీయంగా తగ్గాలన్నారు. గత ఐదేళ్లలో రూ. 5.16 పైసలు ప్రతీ యూనిట్ సగటు విద్యుత్ కొనుగోలు వ్యయం చేశారన్నారు. 2025 ఏప్రిల్ 1 నుంచి యూనిట్ కొనుగోలు వ్యయం రూ4.80కు తగ్గిస్తామన్నారు. వచ్చే విద్యుత్‌ను పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి కోసం వినియోగిస్తామన్నారు. దేశం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేస్తే ఏపీ ఒక్కటే 160 గిగావాట్లను ఉత్పత్తి చేస్తుందని ప్రకటించామన్నారు. పీఎం సూర్యఘర్ కింద ప్రతీ ఇంటిలోనూ విద్యుత్ ఉంటుందన్నారు. డెమాక్రాటైజేషన్ ఆఫ్ ఎనర్జీ అన్నది ఇప్పుడు ఓ కీలక విధానమని తెలిపారు. అలాగే ప్రోస్యూమర్ అన్నది ఇప్పుడు ఓ కొత్త పదమని, ప్రోడ్యుసర్ కమ్ కంజ్యూమర్‌గా ప్రతీ ఇల్లూ మారాలని ఆకాంక్షించారు. 2 కిలోవాట్ల సామర్ధ్యంతో సౌర ఫలకాలను ప్రతీ ఇంటిపైనా ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. వందశాతం మేర సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా ఏపీ మారాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ రావాలని తెలిపారు. ప్రతీ ఇంటికీ 240 యూనిట్ల మేర విద్యుత్ ఉత్పత్తి అవుతుందని.. ప్రస్తుతం రాష్ట్రంలో సగటు వినియోగం 100 యూనిట్ల మేర ఉంటోందన్నారు. మిగతా విద్యుత్ అంతా డిస్కమ్‌లు కొనుగోలు చేసి డబ్బులు చెల్లిస్తాయని చెప్పారు.

**ఇదే లక్ష్యం...**

20 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాల్లోనూ సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ ఏడాది 20 లక్షల ఇళ్లపై ఈ తరహా రూఫ్ టాప్ సోలార్ కనెక్షన్లు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. తద్వారా 1440 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటు సోలార్ పంప్ సెట్ల వద్ద కూడా సౌర విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందన్నారు. రైతులు కూడా ఈ సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. సబ్ స్టేషన్లను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం ద్వారా పంపిణీ నష్టాలను అరికట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలు 9 శాతంగా ఉన్నాయన్నారు. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తామని తెలిపారు. 960 మెగావాట్ల జల విద్యుత్ కూడా పోలవరం ప్రాజెక్టు ద్వారా అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# అన్నిదార్లు పిఠాపురం వైపే

-మొదటిపేజీ తరువాయి

పరిశీలించారు. ఆసాంతం పరిశీలించి తగు సూచనలు అందించారు. సభా ప్రాంగణం మొత్తం కలియ తిరిగి ఏ ఏ ప్రాంతాల్లో ఎలాంటి ఏర్పాట్లు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏ కమిటీ ఎలా పని చేయాలి? ఎక్కడ పని చేయాలి అన్న వివరాలను సైతం అడిగి తెలుసుకున్నారు. కమిటీల సభ్యులకు తగు సూచనలు అందించారు. అనంతరం సభా ప్రాంగణంలోనే నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ గతంలో ఆవిర్భావ సభ జరిపినప్పుడు బందోబస్తు కోసం కోరితే పోలీస్ శాఖ పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అంతంత మాత్రమే స్పందించేది. ఇప్పుడు ఆవిర్భావ సభ కోసం ఏకంగా 1600 మంది పోలీసులు బందోబస్తు కోసం రావడం శుభ సూచకం. కేవలం పిఠాపురం నుంచే కాకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి, రాష్ట్రంలోని నలువైపుల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీగా జన సైనికులు, వీర మహిళలు తరలివచ్చే అవకాశం ఉంది. వారికి తగినంతగా మనం ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. దీనికి పార్టీ తరపున నియమించిన కమిటీలు ఎప్పటికి అప్పుడు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంది.

**మనమంతా నాయకుడికి నిండు మనసుతో కృతజ్ఞత చెప్పుకోవాలి**

జనసేన పార్టీ ప్రస్థానంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎదుర్కొన్న అవమానాలు, అవరోధాలు దాటి ఇప్పుడు ఇంత ఘనమైన పండుగ నిర్వహించుకుంటున్నామంటే మనమంతా నాయకుడికి కృతజ్ఞులై ఉండాలి. ఆయన మనకు సమాజంలో తీసుకొచ్చిన గౌరవం, పార్టీ ద్వారా ఆయన ఆశయాలకు తోడు నిలవడం మనకు ఓ మధురానుభూతి. దీనికి మనం ఎల్లవేళలా పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలుపుతూనే ఉండాలి. అధికారం లేనప్పుడు ప్రజల కోసం ఎలా పోరాటాలు చేశారో అధికారంలో ఉన్నప్పుడు కూడా పవన్ కళ్యాణ్ ప్రజల కోసం అంతే తపిస్తున్నారు. తన పరిధిలో ఉన్న శాఖల ద్వారా విశేషంగా ప్రజలకు సేవలు అందించాలని పాలన సాగిస్తున్నారు. ఓ గొప్ప పోరాటం తాలూకా ఫలితం తర్వాత వచ్చిన గొప్ప సమయం ఇది. దీన్ని మనమంతా ఉత్సవంలా జరుపుకుందాం. మచిలీపట్నం తర్వాత నిర్వహించిన అతి పెద్ద సభగా ఇది నిలుస్తుంది. దేశంలో ఇప్పటి వరకు ఏ పార్టీ కూడా నిర్వహించనంత ఘనంగా జయ కేతనం సభ ఉండబోతోంది. ఇది మనమంతా గర్వించదగ్గ సమయం.

**ఎండ పెరుగుతోంది జాగ్రత్త**

జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ బిందు మాధవ్ ఇప్పుడే మారుతున్న వాతావరణం తాలూకా హెచ్చరికలు తెలిపారు. ఎండలు బాగా పెరుగుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీనికి మనం కూడా సిద్ధంగా ఉండాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. ప్రత్యేకంగా మెడికల్ కమిటీ ఏర్పాటు చేశాం. దీంతోపాటు మెడికల్ సిబ్బంది కూడా సభా స్థలంలో సిద్ధంగా ఉండాలి. మొత్తం 12 అంబులెన్సులను సిద్ధంగా ఉంచాం. అలాగే చుట్టుపక్కల ఆసుపత్రిల సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా సూచనలు చేశాం. దీంతోపాటు సభకు వచ్చేవారికి మంచినీళ్ల ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, పుచ్చకాయలు కూడా ఇచ్చే ఏర్పాటు చేస్తున్నాం. లక్షల్లో బిస్కెట్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయి. అలాగే భోజన ఏర్పాట్లను నాయకులు విరివిగా చేయడం అభినందనీయం. సభకు వచ్చిన వారెవరు ఆకలి లేదా దాహంతో వెళ్లకుండా తగిన ఏర్పాట్లు చేయడం అభినందనీయం. దీనిని సభ రోజు కచ్చితంగా అమలు అయ్యేలా చూసుకోవాలి. ఏ కమిటీకి ఇచ్చిన బాధ్యత ఆ కమిటీ కచ్చితంగా నిర్వహించాలి.

**పార్కింగ్ స్థలాలు, గ్యాలరీలు ప్రత్యేకంగా**

ఎటువైపు నుంచి సభకు వచ్చే వారికి అటు వైపుగా ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించాం. అలాగే ప్రత్యేకంగా గ్యాలరీలు ఉన్నాయి. మహిళలకు ప్రత్యేకంగా గ్యాలరీలు, సౌకర్యాలు కల్పించాం. సభా ప్రాంగణంలో పార్టీ తరపు నుంచి 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎక్కడా ఎలాంటి అవాంతరం లేకుండా సభ జరిగేలా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ప్రారంభమవుతుంది. వివిధ రకాల సంస్కృతులను ప్రతిబింబించేలా కల్చరల్ ప్రోగ్రామ్స్, ఒకరి తర్వాత ఒకరు నాయకుల ప్రసంగాలు, మధ్యలో ప్రత్యేకంగా తొమ్మిది ఆడియో, వీడియో పార్టీ ప్రస్థాన కథనాలు ఉంటాయి. అనంతరం పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రసంగం ఉంటుంది. రోడ్డుకు నలువైపులా ఎల్ఈ డి స్క్రీన్లు, నాలుగు కిలోమీటర్ల మేర ఆడియో వినిపించేలా ప్రత్యేకంగా బాక్సులు ఏర్పాటు చేసాం. అలాగే ఈసారి ప్రత్యేకంగా బాణసంచా ఏర్పాట్లు కన్నుల విందుగా ఉండబోతున్నాయి. ఈ సభ ఇప్పటివరకు ఎవరూ జరపని అతిపెద్ద సభ. ప్రతి ఒక్కరు దీని విజయవంతం చేయడానికి పాటుపడదాం.

**వాలంటీర్ల సేవలు కీలకం**

పార్టీకి మొదటి నుంచి వాలంటీర్ల సేవలు చాలా కీలకం. ఇప్పుడు కూడా వారి సేవలు ఎంతగానో ఉపయోగపడతాయి. పోరాట యాత్ర దగ్గర నుంచి వారాహి యాత్ర, తర్వాత జరిగిన ఆవిర్భావ సభల్లో పార్టీ వాలంటీర్లు చేసిన సేవలు విశేషమైనవి. ఇప్పుడు కూడా వాలంటీర్లు పోలీసులకు సహకరిస్తూ తగువిధంగా పనిచేయాలి.

## రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన..



-మొదటిపేజీ తరువాయి

పాలుపోసినట్లేనంటూ చేసిన తీవ్ర వ్యాఖ్యలను గవర్నర్ దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే సందర్భంలో ఎటువంటి వివక్ష లేకుండా ప్రజలందరికీ సమదృష్టితో పాలనను అందిస్తానంటూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన చంద్రబాబు, దానికి విరుద్ధంగా చేసిన వ్యాఖ్యలపై తక్షణం గవర్నర్ చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రజాస్వామిక స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో సంక్షేమాన్ని అందుకునే లబ్ధిదారులకు పార్టీలు, వర్గాలు ఉండవని అన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన ప్రమాణాలతో అర్హతను బట్టి పథకాలను వర్తింపచేస్తారని, కానీ చంద్రబాబు మాత్రం ఒక వర్గానికి మాత్రమే మేలు చేయాలని, కొందరి పట్ల వివక్ష చూపించాలంటూ చేసిన వ్యాఖ్యలు దారుణమని అన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఏ రాజకీయ నాయకుడు చంద్రబాబులా మాట్లాడలేదన్నారు. రాష్ట్రంలోని ఏ రాజకీయపార్టీ అయినా వారి సిద్ధాంతాలు, విధానాల ప్రకారం పనిచేస్తుందని, రాష్ట్రంలోని మొత్తం ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలన్నదే వారి లక్ష్యంగా పెట్టుకుంటారని అన్నారు. ఏ పార్టీ అయినా వ్యక్తిగత ఏజెండాతో పనిచేయవని, కానీ ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చంద్రబాబు దానికి భిన్నంగా చేసిన వ్యాఖ్యలు, ఆయన అనుసరిస్తున్న విధానాలపై తక్షణం స్పందించాలని గవర్నర్‌ను కోరామని తెలిపారు. సామాన్యుల అవసరాలకు కూడా రాజకీయ పార్టీ రంగు పులమడం దారుణమన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల ప్రయోజనాల కోసమే వైఎస్సార్‌సీపీ.. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వ మెడలు వంచి ప్రజలకు ప్రయోజనాలు కలిగించేలా వ్యవహరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లు, చివరికి జర్నలిస్ట్‌లపైన కూడా తప్పుడు కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని కూడా గవర్నర్ దృష్టికి తీసుకువచ్చామని బొత్స సత్యనారాయణ తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేరుగు నాగార్జున, విడదల రజనీ, కారుమూరు వెంకట నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు వున్నారు.

## విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేయాలి

-మొదటిపేజీ తరువాయి

ఆయన పిలుపునిచ్చారు. కేంద్రం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పబ్లిక్‌రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్‌లకు అప్పగిస్తూ, వారి ఆస్తులను పెంచుకునేందుకు ఉపయోగపడుతోంది. విశాఖ ఉక్కు%-%ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రం కుటిలయత్నాలు చేస్తోంది. కేంద్రం ప్యాకేజీ పేరుతో మోసం చేస్తోంది. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదు. పైగా వీఆర్ఎస్ పేరుతో ఉద్యోగులను ఇళ్లకు పంపుతున్నారని ధ్వజమెత్తారు.

## విజయసాయి అప్రూవర్‌గా మారుతున్నారా...

**విజయవాడ :** వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మనసులో తాను లేనన్న విషయం తెలియగానే మనసు విరిగిపోయిందని వైసీపీలో తను ఒక్కొక్క మెట్టు దిగుతున్న కొద్ది కొంతమంది ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ జగన్ చుట్టూ ఒక కోటరీ లా తయారయ్యారని " వైసిపి మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. పార్టీ నుంచి బయటికి వెళ్లిపోతున్న టైంలో అధినాయకత్వంపై ఎలాంటి విమర్శలు చేయని సాయి రెడ్డి విజయవాడలో సిఐడి ముందు విచారణకు హాజరైన సమయంలో మీడియా ముందు తన వేదనంతా బయట పెట్టేశారు. కాకినాడ పోర్టులో వాటాలను విజయసాయిరెడ్డి, అల్లుడి సోదరుడు శరత్ చంద్రరెడ్డి,వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డి బలవంతంగా లాగేసుకున్నారని పోర్టు యజమాని ఐ.ం రావు సిఐడికి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు పెట్టి సీఐడీ నోటీసులు అందజేసింది. మొదట్లో చంద్రబాబు నాయుడిపై విజయ సాయిరెడ్డి నిప్పులు చెరిగారు. అది గతం ఇప్పుడు ఆయన వైసీపీ మాజీ నేత. అందుకే కానీ బుధవారం విచారణకు హాజరైన తర్వాత ఆయన శైలి మారిపోయింది. ప్రధానంగా వైసిపి హైకమాండ్‌ని టార్గెట్ చేస్తూ సంచలన కామెంట్స్ చేశారు.కాకినాడ పోర్టు వివాదంలో తన పాత్ర లేదని చేసిందంతా వైవి సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి అని చెప్పారు. వాళ్లు అమెరికా వెళ్ళినప్పుడు కేసు వేసిన కె.వి రావు ఇంట్లోనే ఉండేవారిని ఆరోపించారు విజయసాయిరెడ్డి. అలాగే ఈ కేసుకు సంబంధం లేని మద్యం స్కాంపై కూడా మాట్లాడుతూ అప్పటి జగన్ ప్రభుత్వం అడ్వైజర్ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కనుసన్నల్లోనే వ్యవహారం నడిచిందని బాంబు పేల్చారు. ఆ కేసులో కూడా విజయసాయిరెడ్డి సహా వైసీపీకి చెందిన చాలా ముఖ్యమైన వాళ్ళ పేర్లు ఉన్నాయి. దీనిపై సిట్ వేశారు ప్రస్తుతం విచారణ సాగుతోంది. త్వరలోనే కొన్ని పెద్ద తలకాయల అరెస్టులు తప్పవని అంటున్నారు.వైసీపీ నుంచి ఎవరైనా తనపై విమర్శలు చేస్తే చాలా విషయాలు మాట్లాడతా అంటూ విజయసాయిరెడ్డి వార్నింగ్ పంపించారు. దీనితో విజయసాయిరెడ్డి త్వరలో అప్రూవర్‌గా మారతారా అంటూ ఏపీ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. విచిత్రంగా సాయి రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేసినా పార్టీ నుంచి పెద్ద లీడర్లు ఎవరూ ఇంతవరకూ స్పందించలేదు. దాంతో విజయసాయి రెడ్డి దగ్గర పార్టీకి చెందిన చాలా రహస్యాలు ఉన్నాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. పార్టీ వదిలి తాను వెళ్తాను అన్నప్పుడు "తనకు విశ్వసనీయత లేదని, భయపడ్డానని, ప్రలోభాలకు లొంగి పోయానని " జగన్ అన్నారు. కానీ తనకు అలాంటివేవీ లేవని.. సిబిఐ,ఈడీ కేసులు ఉన్నా భయపడలేదని చెప్పుకొచ్చారు విజయసాయి రెడ్డి. జగన్ చుట్టూ ఏర్పడిన కోటరీ ఆయనకు వాస్తవాలు తెలియకుండా చేస్తుందని ఆరోపించారు. నాయకుడు చెప్పుడు మాటలు వినడం మొదలుపెడితే పార్టీకి ప్రజలకు తీవ్ర నష్టమని హెచ్చరించారు. గత మూడున్నర ఏళ్లుగా అవమానాలు ఎదుర్కొంటూ వచ్చానని సాయిరెడ్డి అన్నారు. సజ్జల రామకృష్ణ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఒకోను ఉద్దేశించి విజయ సాయిరెడ్డి ఈ కామెంట్స్ చేశారని సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోంది. విజయ సాయి రెడ్డిని ఉత్తరాంధ్ర ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించి వైవి సుబ్బారెడ్డిని పంపించారు. ఢిల్లీలోనూ వైవి సుబ్బారెడ్డికి ప్రాధాన్యత పెంచారు. సీఎం క్యాంపు కార్యాలయంలో మొత్తం సజ్జలదే హవా కావడం తనను దూరం పెట్టారనేది విజయసాయి రెడ్డి అభిప్రాయం. అధినాయకుడు జగన్ దగ్గరే తనకు విలువ లేదని తెలిసి మనసు విరిగిపోయిందని ఆయన మొదటిసారిగా మీడియా ముందు బాధ వెళ్లబుచ్చారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే త్వరలోనే విజయ సాయి రెడ్డి తనపై నమోదైన కేసుల్లో అప్రూవర్‌గా మారే అవకాశం లేకపోలేదని అంటున్నారు. అదే గనుక జరిగితే వైసీపీలో పెద్ద తలకాయలకు చాలా ఇబ్బందులు తప్పవని అప్పుడే రాజకీయ వర్గాల్లో చర్చలు ఊపందుకున్నాయి.

## పవన్ కళ్యాణ్ శాఖలో లోకేష్ చొరవ

**విజయవాడ :** నారా లోకేష్ క్షమాపణ చెప్పారు. నల్లమల లోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కాశీనాయన సత్రాన్ని అటవీ అధికారులు కూల్చేశారు. నిరంతర అన్నదానం జరిగే కట్టడాలు కూడా ఇందులో ఉన్నాయి. టైగర్ జోన్ ఏర్పాటు, అటవీ శాఖ నిబంధనల వల్ల ఫారెస్ట్ అధికారులు నల్లమల అటవీ ప్రాంతంలోని కాశీనాయన ఆశ్రమాన్ని కూల్చేశారు. దీనిపైనే నారా లోకేష్ క్షమాపణ చెబుతూ ప్రజల మనోభావాల్ని విజ్ఞప్తులను అధికారులు దృష్టిలో పెట్టుకుని ఉంటే బాగుండేదని.. ఈ ఘటన కు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే కూల్చేసిన కట్టడాలని తిరిగి తాను నిర్మిస్తానని భక్తులకు హామీకు ఇచ్చారు.నారా లోకేష్ ప్రకటన భక్తులకు ఊరట కలిగించిన మాట వాస్తవమే కానీ ఆ శాఖ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి చెందింది కావడం విశేషం.

వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 14.03.25 శుక్రవారం



## భూఅక్రమాల పై నమోదైన కేసుల విచారణ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)

భూఅక్రమాలపై నమోదైన కేసుల విచారణ వేగవంతం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. గురువారం (తరువాయి 4లో...)

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ఎమ్మెల్యే కందుల సమక్షంలో అంగరంగ వైభవంగా తెప్పోత్సవం



## కన్నుల పండుగలా సాగిన కార్యక్రమం భారీగా పాల్గొన్న భక్తులు







(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 13)

పొదిలి పట్టణంలోని శ్రీ పార్వతీదేవ సమేత నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం తెప్పోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని ఉభయదాతలు గునుపూడి, భవాని బ్రదర్స్ కలిసి వేదపండితులతో పాటు ప్రతిపాదిత ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను భక్తులు హంస వాహనం పై ఊరేగింపుగా కోనేరు వద్దకు చేర్చారు. కోనేరులో తెప్పోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. విద్యుత్ దీపాలు, పూలతో దేదీప్యమానంగా అలంకరించిన హంస వాహనంలో శ్రీ పార్వతి సమేత నిర్మమహేశ్వరస్వామి వార్లు కొలువుతీరి భక్తుల నీరాజనాలు అందుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు తెప్పోత్సవం వైభవంగా సాగింది. ఈ సుందర దృశ్యాన్ని భక్తులు భారీగా దర్శించుకున్నారు. కన్నుల పండుగలా జరిగిన ఈ ఉత్సవాన్ని పొదిలి పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు వీక్షించారు. అంతకు ముందు శివాలయం అధికారులు, పురోహితులు భారీ భక్తజనసందోహాల మధ్య స్వామి వారి ఉత్సవ మూర్తులను శివాలయం నుంచి తెప్పోత్సవం నిర్వహించే కోనేరు వరకు మేళతాళాలు, ఇతర ప్రదర్శనల నడుమ ఊరేగింపుగా కోనేరు వద్దకు తీసుకువచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనం పై ఆశీనులైన ఉత్సవ మూర్తులకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఉభయదాతలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యుత్ దీపకాంతులు, మేళతాళాలు, పవిత్ర హారతులు, బాణా సంచా వెలుగుల మధ్య, శివ నామస్మరణతో తెప్పోత్సవం కన్నుల పండుగలా సాగింది. ఈ సందర్భంగా తెప్పోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మాట్లాడుతూ 90 ఏళ్ళ క్రితం నిర్మాణానికి నోచుకుని పాడుపడి పోయిన కోనేరును పొదిలి పట్టణ ప్రజలు, భక్తులు అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి పరచి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంతో పాటు 90 ఏళ్ళ తర్వాత కన్నుల పండుగలా తెప్పోత్సవాన్ని నిర్వహించడం, అదీ తన చేతుల మీదుగా జరగడం పూర్వ జన్మశుక్రుతనంగా భావిస్తున్నానని చెప్పారు. ఆలయ అభివృద్ధికి దేవాదయశాఖ ద్వారా మరిన్ని నిధులు మంజూరు చేయించి వచ్చే శివరాత్రి వేడుకల నాటికి మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ వేడుకలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి, ప్రతిపాదిత ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, తెప్పోత్సవ ఉభయ దాతలు గునుపూడి భాస్కర్ అండ్ బ్రదర్స్ దంపతులు, పేర్ల వెంకట శ్రీనివాసరావు అండ్ బ్రదర్స్ దంపతులు, శివాలయం మాజీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), టిడిపి మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, ముల్లా ఖుద్దూస్, మాజీ జడ్పీటిసి కాటూరి వెంకట నారాయణబాబు, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు సయ్యద్ ఇమాంసా, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, తానికొండ వెంకట్రావు, (తరువాయి 5లో...)

## శాఖల వారీగా సమాచారాన్ని 17లోపు పంపించాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)



ఈ నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు శాఖల వారీగా సమాచారాన్ని ఈ నెల 17వ తేదీలోగా తనకు సమర్పించాలని అన్ని శాఖల ఉన్నతాధికారులను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ నెల 24,25వ తేదీలలో ఈ కాన్ఫరెన్స్ ఉన్నందున అన్ని శాఖల జిల్లా అధికారులతో గురువారం ఆమె ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో పీపీటీ ద్వారా వివిధ అంశాలను, ముఖ్యంగా జిల్లాలోని పరిస్థితులను బట్టి టాప్-5 శాఖలకు సంబంధించిన వివరాలను, ప్రస్తుత సమస్యలు మూడు నెలలలోగా వాటి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలను వెల్లడించాల్సి



ఉన్నందున సమగ్ర సమాచారాన్ని తనకు అందించాలని అధికారులకు దిశా నిర్దేశం చేసారు. మూడో శనివారం సందర్భంగా ఈ నెల 15వ తేదీన నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులను, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడంపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో డి.వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ లబ్దిదారులు ఇళ్లు నిర్మించుకునేలా దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)



రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి, ఎస్టి, బిసి లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి ఆర్థిక తోడ్పాటు కల్పిస్తూ అదనపు సాయంగా రూ.50 వేల నుండి ఒక లక్ష రూపాయలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో, క్షేత్ర స్థాయిలో గృహ నిర్మాణ లబ్దిదారులకు ఈ విషమై అవగాహన కల్పిస్తూ త్వరగా ఇల్లు నిర్మించుకునేలా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలసి, గృహ నిర్మాణాల పురోగతి, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలు, ఐజిఓటి కర్మయోగి వెబ్ పోర్టల్ నిర్వహణ తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా, జిల్లాలో 2029 నాటికి "అందరికీ గృహనిర్మాణం" అనే లక్ష్యాన్ని సాధించేందుకు, అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలు, బీసీ లబ్దిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు 75 వేలు, పీవీటీజీ లబ్ధిదారులకు లక్ష రూపాయలు అదనపు ఆర్థిక సహాయం అందిస్తోందని, క్షేత్ర స్థాయిలో గృహ నిర్మాణ లబ్దిదారులకు ఈ విషమై గృహ నిర్మాణా లబ్దిదారులకు అవగాహన కల్పిస్తూ త్వరగా ఇల్లు నిర్మించుకునేలా దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారులను, ఎంపిడిఓ లను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ ఎమెనిటీస్ సెక్రటరీలు అర్హత కలిగిన ప్రతి లబ్దిదారుని ఇంటిని తనిఖీ చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి యొక్క ఫోటోను క్యాప్చర్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు ఎమెనిటిస్ సహాయకులు, ఎంపిడివోలు, మున్సిపల్ కమీషనర్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్దిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ విషమై ప్రజాప్రతినిధులకు తెలియచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మే నెలాఖరు నాటికి జిల్లాలో లక్ష్యం మేరకు 8,839 గృహాలు పూర్తి చేయాలని, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని లక్ష్యం మేరకు ఇళ్ళ నిర్మాణాలు పూర్తీ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15న మూడవ శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఒక్కొక్క నెల ఒక్కొక్క అంశంతో ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోందని.. ఇందులో భాగంగా ఈనెల ప్లాస్టిక్ వాడకం తగ్గించే పద్ధతులపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. అదే సమయంలో క్లాత్ సంచులు, జూట్ బ్యాగ్ ల వినియోగం పెరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో అన్నీ వర్గాల ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత, స్థిరమైన పద్ధతుల పాటింపు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంస్థాగత నిర్మాణం, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణలు ఇచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐజిఓటి కర్మయోగి వెబ్ పోర్టల్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానమైందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో సిఎఫ్ఎంఎస్ఐడి ఉన్న ప్రతి ఉద్యోగికి శిక్షణ ఇవ్వడమే దీని ప్రధాన ఉద్దేశ్యమని, ప్రతి ఉద్యోగి ఈ ప్రక్రియ ద్వారా విధిగా శిక్షణ పొందాల్సి ఉందన్నారు. హార్ట్ ఇన్ గవర్నెన్స్, కోడ్ ఆఫ్ కాండాక్ట్ ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్, ఓరియంటేషన్ మాడ్యూల్ (తరువాయి 5లో...)



# ఎమ్మెల్యే కందుల సమక్షంలో
# అంగరంగ వైభవంగా తెప్పోత్సవం



















# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

నార్ల అంకారావు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 13)

పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి జన సైనికులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాచర్ల మండల ప్రధాన కార్యదర్శి నార్ల అంకారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంకారావు మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపించి 11 సంవత్సరాలు పూర్తయిందని, పార్టీని ప్రారంభించినప్పటి నుంచి ఎన్నో ఒడిదుడుకులు, అవమానాలు ఎదుర్కొంటూ తమ నాయకుడు అంచలంచెలుగా ఎదిగి నేడు జనం గుండెల్లో జన సైనికుడిగా జనసేన పార్టీ అధినేతగా ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారని తెలిపారు. జనసేనతోనే రాజకీయ ప్రస్థానం మొదలైందని, పార్టీని నమ్ముకున్న ప్రతి జనసైనికుడికి అండగా పవన్ కళ్యాణ్ నిలబడ్డారని, ఎన్నో చేదు అనుభవాలను చవిచూసి అవమానకర పరిస్థితులను ఎదుర్కొని ప్రజల పక్షాన పోరాడడానికి రాజకీయ అరంగేట్రం చేసి 11 సంవత్సరాలు ఏకతాటిపై పార్టీని బలోపేతం చేసిన జననాయకుడు జన సేవకుడు కొణిదల పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. 11ఏళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్న మొట్టమొదటి ఆవిర్భావ దినోత్సవ వేడుక కాబట్టి జనసైనికులు అందరూ భారీగా తరలివచ్చి పిఠాపురంలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్లను విశాలమైన ప్రాంతంలోకి తరలించాలి

శాసనమండలిలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 13)



శాసనమండలి సమావేశాలలో నెల్లూరులో ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతున్నందున ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్లను విశాలమైన ప్రాంతంలోకి తరలించాలని శాసనమండలిలో ప్రభుత్వాన్ని కోరారు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. ఏపీ శాసనమండలి సమావేశాలలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2006 నుంచి నెల్లూరు నగరం విస్తరించి మహానగరంగా అభివృద్ధి చెందుతున్నందున నెల్లూరులో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందన్నారు. నెల్లూరు నగరంలో ఉన్నటువంటి ఆర్టీసీ బస్టాండు, ఆత్మకూరు బస్టాండ్లను... ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా.. గతంలోనే వాటిని ఇతర ప్రాంతాలకు మార్చేందుకు.. ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. కానీ ఇప్పటివరకు నూతన బస్టాండ్ల ఏర్పాటుకు అడుగు ముందుకు పడలేదన్నారు. నెల్లూరు నగరంలో ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్టాండు, ఆత్మకూరు బస్టాండ్‌ను.. నెల్లూరు నగరం వెలుపల నూతన బస్టాండ్‌లను నిర్మించి..వాటిని అక్కడికి తరలించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్లను, సిటీ బస్టాండ్లుగా వినియోగించుకుంటే.. ట్రాఫిక్ సమస్యను నివారించవచ్చని ప్రభుత్వానికి సూచించారు.

# శ్రీనివాస కళ్యాణోత్సవ ఆహ్వానం

దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి

ఆనం రామనారాయణరెడ్డితో టీటీడీ ఈవో, జెఈవోల భేటీ





(షణ్ముఖ వెలుగు, అమరావతి, మార్చి 13)

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో మార్చి 15న వేంకటపాలెంలో నిర్వహించనున్న శ్రీనివాస కళ్యాణోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి టీటీడీ ఈవో, జెఈవోలు అధికారికంగా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంతో టీటీడీ అధికారులు సమావేశమై కళ్యాణోత్సవ ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, స్వామి వారి కళ్యాణ వేదిక ఏర్పాట్ల గురించి వివరంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్రమబద్ధమైన ఏర్పాట్లు జరిగేలా జాగ్రత్త వహించాలని మంత్రి ఆనం సూచించారు.

# కవయిత్రి మొల్ల జయంతి వేడుకల్లో కాకాణి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి13)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి. కాకాణి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలోనే మొదటి మహిళా కవ యిత్రిగా మొల్లమాంబది ప్రత్యేక స్థానం అన్నారు. మొల్లమాంబ కవిత్వం సరళమైనది గాను, రమణీయమైనదిగాను ప్రసిద్ధిగాంచిందన్నారు. రామాయణ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించిన తొలి మహిళా విదుషీమణి మొల్లమాంబ అని తెలిపారు. కుమ్మరి కుటుంబంలో జన్మించి, ప్రాచీన భారతావనిలో అనేక కట్టుబాట్లు, ఆటుపోటులు ఎదుర్కొని మహిళా కవియిత్రిగా రాణించిన మొల్లమాంబ తెలుగుజాతికే గర్వకారణమని, మొల్లమాంబ తెలుగులో రచించిన మొల్ల రామాయణం ఇప్పటికే అత్యంత ప్రసిద్ధికెక్కిన గ్రంధాలలో ఒకటిగా పేర్కొన్నారు. తెలుగుజాతి గొప్పతనాన్ని కీర్తిని విశిష్టతను 16వ శతాబ్దంలోని లోకానికి చాటి చెప్పిన వీరవనిత మొల్లమాంబ. మహానేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి కోరిక ఆనాటి కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో, తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించిందన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారి కృషి మేరకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రము ను నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో వెంకటాచలం మండల కేంద్రంలో ఏర్పాటు



చేయాలని నిర్ణయించి, తాత్కాలిక భవంతిలో ప్రారంభించారు. చంద్రబాబు నాయుడు 2014 నుండి 2019 వరకు అధికారంలో ఉన్నా, ప్రతిపక్ష శాసనసభ్యునిగా ఎన్ని విజ్ఞప్తులు చేసినా, స్థలం కేటాయించలేకపోయాడు. కేంద్ర ప్రభుత్వం భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నా, స్థల సేకరణ పూర్తి కాకపోవడంతో తెలుగు ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం సమగ్రంగా పరిశోధనలు నిర్వహించడానికి శాశ్వత భవనాలు లేకుండా పోవడం అడ్డంకిగా మారిందన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత స్థల సేకరణ పనులు ఊపందుకున్నాయి. స్థల సేకరణ పనులు ప్రారంభించగానే కొంతమంది కోర్టుకు వెళ్లి, స్థల కేటాయింపును అడ్డుకున్నారు. అధికార పార్టీ శాసన సభ్యునిగా కోర్టు కేసులన్నీ పరిష్కరించుకొని, మార్కెట్ ధర నిర్ణయించి, ప్రభుత్వ అనుమతి కోసం నాటి కలెక్టర్ ప్రతిపాదనలు పంపించారు. నేను మంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక, జరిగిన తొలి క్యాబినెట్ సమావేశంలోనే ప్రభుత్వ మార్కెట్ ధరకు భూములు కేటాయించడానికి అంగీకారం తెలిపామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం భూ కేటాయింపులకు ఎటువంటి పరిహారం చెల్లించలేమని, భూమిని ఉచితంగా అందిస్తేనే, నిధులు విడుదల చేసి భవన నిర్మాణాలు మొదలుపెడతామని మెలిక పెట్టిందన్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి మరుసటి క్యాబినెట్ సమావేశంలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మార్కెట్ విలువతో సంబంధం లేకుండా ఉచితంగా భూమి కేటాయించాలని ప్రతిపాదించి ఆమోదింపజేశారు. జగన్మోహన్ రెడ్డి సంకల్పం, నా కృషితో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సర్వేపల్లి ప్రాంతం నుండి తరలిపోకుండా, శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు దోహదపడిందన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంచేందుకు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పాటుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. మొల్లమాంబ జయంతిని వేడుకగా నిర్వహించ తలపెట్టి, రాష్ట్ర పండుగగా ప్రకటించిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వెనుకబడిన వర్గాలతో పాటు, నా ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు.

# ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మార్చి 13)

పూర్వం మహిళలు బయటకు రాలేని సమయంలో ఒక మహిళగా బయటకు వచ్చి విద్యనభ్యసించి వాల్మీకి రామాయణ మహా గ్రంథాన్ని తెలుగులోకి అనువదించిన గొప్ప మహిళా కవయిత్రి మొల్లమాంబ అని శాలివాహన సంఘ నాయకులు కొర్రపాటి ఓబులేసు అన్నారు. ఆయన అధ్యక్షతన స్థానిక ఎంజీఆర్ కళ్యాణ మండపంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్ పట్నం నరసింహం మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని తేనెలొలికే అచ్చమైన తెలుగులో రచించిన ఖ్యాతి మహా కవయత్రి మొల్లమాంబ కే దక్కుతుందని, తొలి తెలుగు కవయిత్రిగా తనకంటూ ప్రత్యేక స్థానం పదిలపరుచు కుందని ఆయన అన్నారు. తెలుగు టీచర్ అంకమ్మరావు మాట్లాడుతూ మహా మహా పండితులు సైతం మొల్ల రామాయణాన్ని ప్రామాణికంగా ఉదాహరిస్తూ ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ గారు మాట్లాడుతూ నల్ల మాంబా యొక్క గొప్పతనాన్ని వివరించి ఆమె విగ్రహానికి మునిసిపల్ పరిధిలో స్థలాన్ని కేటాయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘ నాయకులు కొర్రపాటి ఓబులేసు, పట్నం నరసింహం, అంకమ రావు, గొట్టం అంజి కుమార్, చీమలదిన్నె మాధవ, అబ్బూరి రామయ్య, దగ్గుపాటి మహాలక్ష్మమ్మ, బాపనపల్లి మాల్యాద్రి, పిడతల తిరుపతయ్య, డివి నారాయణ, చిరంజీవి, మాలపాటి సంజీవయ్య, సిద్దు, చేతరాజుపల్లి బాలకోటేసు, ధనుంజయ్, సుధాకర్, కొర్లపాటి నవీన్ శాలివాహన మహిళలు, మరియు బీసీ సంఘ నాయకులు పళ్ళ మాలకొండయ్య, దేవరాజు గట్టు శివ కాశయ్య, దేపూరి వెంకటేశ్వర్లు, చెరుకూరి చిన్న కాశయ్య, వెనిచర్ల శ్రీనివాసులు , చింతలపూడి వాసు, ఈర్ల విజయరామరాజు, చింతలపూడి సాగర్, బొప్పరాజు సుబ్బారావు, కండ్లకుంట గురు ప్రసాద్, సిద్ధాంతి బారాయి మామ్, పొట్టేళ్ల మాలకొండయ్య, కోమటిగుంట బాబురావు, సిగ కృష్ణారావు, చింతలపూడి తిరుపాలు, టీచర్ పూర్ణచంద్రరావు, పెన్నా వెంకటేశ్వర్లు, కొబ్బరి బోండాల సుబ్బారావు, గంగరాజు యాదవ్, పులి రాయుడు, కాసుల శ్రీరాములు, వనమాలి, నాయకులందరూ పాల్గొన్నారు.

# డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం

ఇంటర్ కాలేజ్ పోటీల్లో ప్రతిభ బాస్కెట్‌బాల్ విభాగంలో ఒంగోలు వైద్య కళాశాల టీంకు తృతీయ బహుమతి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)

ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. డాక్టర్ నందమూరి తారక రామారావు ఆరోగ్య విశ్వ విద్యాలయపు ఇంటర్ కాలేజ్ పోటీల్లో బాస్కెట్‌బాల్ విభాగంలో ఒంగోలు వైద్య కళాశాల టీం 3వ బహుమతి సాధించారు. విజయవాడలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వారి నుంచి బహుమతి నీ అందుకున్నారు. ఈ సందర్భగా టీం సభ్యులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండల రావు అభినందించారు. ట్రోఫీను ఆయనకు అందజేశారు. టీం సభ్యులను అభినందించిన వారిలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, పీడీ రాధాకృష్ణ తదితరులున్నారు. ఈ విజయంతో గవర్న మెంట్ మెడికల్ కాలేజ్, ఒంగోలు బాస్కెట్‌బాల్ బృందం తమ ప్రతిభను మరోసారి సత్తా చాటింది అని, పలు రంగాల్లో విద్యార్థులు ప్రగతి చూపడం శుభ పరణామమని డాక్టర్ ఏడుకొండలరావు అన్నారు.

# బర్లీ పొగాకుకు ధర ఏది...?

**గత ఏడాది కన్నా గణనీయంగా పడిపోయిన బర్లీ పొగాకు ధరలు**
**అడుగు పొగాకుకు గతేడాది క్వింటాకు రూ.10వేలు ఇస్తే, ఈ ఏడాది రూ.3 వేలు కే కొనుగోలు**
**లబోదిబోమంటున్న బర్లీ పొగాకు సాగు రైతులు**
**ప్రకాశం జిల్లా సంయుక్త కిసాన్ మోర్చ కన్వీనర్ చుండూరి రంగారావు డిమాండ్**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)

బర్లీ పొగాకు ధరలు గణనీయంగా పడిపోయాయని, గత సంవత్సరంతో పోలిస్తే సగానికి సగం తగ్గిన ధరలతో బర్లీ పొగాకు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, రెండు పర్యాయాలు భారత ప్రభుత్వ పొగాకు బోర్డు సభ్యులు, సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బర్లీ పొగాకు ( బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ ) సాగు గణనీయంగా పెరిగిందన్నారు. ప్రస్తుతం ఈ పొగాకు సాగు బాపట్ల,గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలలోని పలు నియోజకవర్గాలలో ప్రధానంగా సాగు అవుతుందని,రాష్ట్రంలో బర్లీ పొగాకు సాగుకు ప్రధాన కారణం ఈ పొగాకును సిగరెట్ల తయారీలో ఉపయోగించటం, గత కొన్ని సంవత్సరాలుగా వర్జీనియా ఫ్లూ క్యూరీడ్ పొగాకు ఉత్పత్తి పలుదేశాల్లో వాతావరణ మార్పుల కారణంగా తీవ్రంగా తగ్గడం ప్రధాన కారణమన్నారు. దీంతో సిగరెట్ తయారీదారులు బర్లీ పొగాకు ద్వారా ఈ తగ్గుదల నుండి బయట పడే క్రమంలో అనూహ్య ధర ఇచ్చారన్నారు.బర్లీ పొగాకు సాగుకు కౌలు రైతులు, రైతు కూలీలు ఎగబడి సాగు చేశారన్నారు.అయితే నేడు ధరలు రాక, పెట్టిన పెట్టుబడులు నష్టపోతామని తీవ్ర మనోవేదనకు గురవుతున్న పరిస్థితి నేడు రాష్ట్రంలో నెలకొందన్నారు. రైతులు, కౌలు రైతులు చెబుతున్న ప్రకారం గత ఏడాది ధరల్లో సగం ధర కూడా రావటం లేదని,బ్లాక్ బర్లీ అయితే అడిగే నాథుడే లేడని వాపోతున్నారన్నారు.ఎకరా బర్లీ పొగాకు సాగుకు రూ. 1.50 లక్షలు ఖర్చయిందని, ఎకరాకు సదాసిరిన 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, వాతావరణం కారణంగా, విత్తన మూలంగా రావలసినంత తూకం రావడం లేదని, సాగు సమయంలో ప్రోత్సహించిన వ్యాపారుల తాబేదారులు ఇప్పుడు మాట మార్చి కావలసిన దానికంటే చాలా ఎక్కువ ఉత్పత్తి జరిగిందని, అందుచేత తొందరపడి అధక ధర లకు కొనుగోలు చేయవలసిన పరిస్థితి లేదని చెబుతూ రైతులను మానసికంగా దెబ్బతీసి,అతి తక్కువ ధరలకు బదులు మాట్లాడకుండా అమ్ముకునే పరిస్థితిని కల్పిస్తున్నారన్నారు . గత ఏడాది అడుగు బర్లీ పొగాకును క్వింటా రూ. 15 వేలు మేర కొనుగోలు చేశారని,అయితే అదే పొగాకును ఈ ఏడాది రూ. 3 వేలుకు మించి అడగటం లేదన్నారు. మధ్య వరస బర్లీ పొగాకును గత ఏడాది రూ. 17 వేలు మేర కొనుగోలు చేశారన్నారు. అయితే ఈ పొగాకు అమ్మకాలు ఇంకా ప్రారంభం కావలసి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలుగజేసుకొని బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధరలు ఇప్పించాలని డిమాండ్ చేశారు.బర్లీ పొగాకు ధరలపై శాసనసభలో ఎమ్మెల్యేలు ప్రస్తావించి రైతులకు గిట్టుబాటు ధరలు దక్కేల ప్రభుత్వంపై వత్తిడి తేవాలన్నారు.సాగు సమయంలో చిలువలు పలువులుగా వర్ణించి అత్యధిక సాగుకు కారణభూతులైన వ్యాపారుల అనుచర గణాన్ని కట్టడి చేయని ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే నేడు ఈ సంక్షోభం ఆవిర్భవించింది. సంక్షోభాన్ని నివారించాల్సిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. జాప్యం జరిగితే రైతుల ప్రాణాలకు ముప్పు వాటిని ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# భూఅక్రమాల పై నమోదైన కేసుల విచారణ వేగవంతం చేయాలి

సాయంత్రం కలెక్టరేట్లో జిల్లా కలెక్టరు ఏ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టరు ఆర్.గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పి నాగేశ్వర రావులతో కలసి భూఅక్రమాలపై నమోదైన కేసుల విచారణ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూఅక్రమాలపై నమోదైన కేసుల విచారణ వేగవంత చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కేసులకు సంబంధించి అవసరమైన డాక్యుమెంట్స్‌ను సంబంధిత రెవెన్యూ, మునిసిపల్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సత్వరమే విచారణ అధికారులకు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ ఏ. బాలంజనేయులు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, ఒంగోలు డిఎస్పి ఆర్.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, పలువురు సిఐలు, తహసీల్దార్ వాసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ లబ్దిదారులు ఇళ్లు నిర్మించుకునేలా దృష్టి సారించాలి

ఆన్ మిషన్ లైఫ్ అనే మూడు డిజిటల్ శిక్షణలనే ఉద్యోగి పనితీరును ప్రామాణికంగా చేసుకుంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహించినంతకాలం ఈ మూడు శిక్షణల ఆధారంగానే సంస్థాగత నిర్మాణం జరుగుతుందన్నారు. ఒక్కొక్క శిక్షణ కేవలం 18 నిమిషాలు మాత్రమే ఉంటుందని చెప్పారు. శిక్షణ తదుపరి ఆన్ లైన్ లో వచ్చే ప్రశ్నావళికి సరైన సమాధానాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలకు మెరుగులు పెట్టడానికే 856 శిక్షణ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో శిక్షణలు ఇవ్వాల్సి ఉందన్నారు. సమీకృత ఆన్ లైన్ డిజిటల్ శిక్షణలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జడ్పి సిఈఓ చిరంజీవి, హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి శ్రీనివాసరావు, డిపిఓ వెంకటనాయుడు, డ్వామా పిడి జోసఫ్ కుమార్, సిపిఓ వేంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి శ్రీనివాసరావు, డిడి సోషల్ వెల్ఫేర్ లక్ష్మా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొనగా, క్షేత్ర స్థాయి నుంచి మున్సిపల్ కమీషనర్లు, డిఎల్‌డిఓలు, ఎంపిడిఓలు, ఈఓపిఆర్డిలు, ఎపిఓ, తదితరులు పాల్గొన్నారు.

# కొనేటికి మహా సంప్రోక్షణ

## కందుల ఆధ్వర్యంలో కనువిందుగా స్వామి వారి ఉత్సవ ఏర్పాట్లు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 13)
పొదిలి శ్రీ నిర్మమహేశ్వరస్వామి వారి తెప్పోత్సవానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణతో కొనేటికి మహా సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మ శ్రీ దరిశి రామమూర్తి ఆధ్వర్యంలో తొలుత శూల స్థానం, త్రిశూల స్థానం అనంతరం చక్రోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, కుటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రజల సందర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తొలిసారి నిర్మమహేశ్వరస్వామి వారికి తెప్పోత్సవం నిర్వహించనున్నారు. పొదిలిలో తొలిసారిగా తెప్పోత్సవం నిర్వహించనున్న సందర్భంగా భక్తులలో ఆసక్తి నెలకొంది.

# మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కందుల సతీమణి వసంతలక్ష్మి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 13)
16వ శతాబ్దపు ప్రముఖ కవయిత్రి "మొల్ల రామాయణంను రచించిన







మొల్లమాంబ నూతన విగ్రహం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదుట ఏర్పాటు చేశారు. ఆ నూతన విగ్రహాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి గురువారం ఆవిష్కరించారు.

# యువత పోరు విజయవంతం

## వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల జిల్లా అధ్యక్షుడు నాగార్జున, అశ్రిత్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 13)




వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు నగరంలోని నిర్వహించిన యువత పోరు కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయ్యిందని పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున అన్నారు. ఈ మేరకు గురువారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. తమ పార్టీ ఇచ్చిన ఒక్క పిలుపుతో వేలాది మంది విద్యార్థులు, తల్లితండ్రులు, ప్రజలు స్వచ్ఛంధంగా తరలి వచ్చి యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందనేందుకు ఇదోక ఉదాహరణ శాంపిల్ మాత్రమేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అన్ని వర్గాలతో పాటు విద్యార్థులు, యువకులకు అనేక హామీలివ్వడం జరిగిందన్నారు. ఆ హామీలను నెరవేర్చకపోవడం వలన యువకులు ఉద్యోగాలు, ఉపాధి లేక రోడ్డునపడ్డారన్నారు. యువకులు, విద్యార్థుల జీవితాలతో అడుకుంటున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే యువత పోరు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గతంలో తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కారోనా కష్టకాలంలో కూడా ఇచ్చిన హామీలను 90శాతం నెరవేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా నేటికి విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన పరిస్థితి లేదన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు అందిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇదేవిధంగా కొనసాగితే మాత్రం రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తమ నాయకుల సహాయ సహకారంతో యువజన, విద్యార్థి విభాగాల సంయుక్తంగా తమ పోరాటాలని మరింత ఉధృతం చేసి కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించేలా కార్యక్రమాలు చేస్తుందని ఆయన హెచ్చరించారు. పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రియింబర్స్‌మెంట్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆతరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నీర్చు గార్చిందన్నారు. ఆతరువాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులు విద్యనభ్యసించేందుకు ఫీజురియింబర్స్‌మెంట్ పథకాన్ని వందశాతం అమలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్‌ను మరిచిందన్నారు. దాదాపు రూ.7100కోట్లు ఫీజురియింర్స్‌మెంట్ బకాయిలు ఉండగా రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.2,600కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. అంటే కొంత మంది విద్యార్థులకు మాత్రమే ఫీజు రియింబర్స్‌మెంట్ వస్తుందని మిగిలిన విద్యార్థులను ఏం చేయదలచుకున్నారని ఆయన ప్రశ్నించారు. విద్యాసంవత్సరానికి రూ.3,900 కోట్లు ఖర్చు అవుతుందని ఇందులో రూ.2,800కోట్లు రియింబర్స్‌మెంట్‌కు ఖర్చు కాగా మిగిలిన రూ.1,100కోట్లు హాస్టల్స్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లకు ఖర్చు అవుతుందన్నారు. పరిస్థితిని ప్రజలందరూ గమనిస్తునే ఉన్నారని విద్యార్థులందరూ ఆగ్రహావేశంతో ఉన్నారని చెప్పారు. చంద్రబాబు విద్యార్థులను విస్మరించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని విమర్శించారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం లాఠీ దెబ్బలు తింటుంటే విద్యాశాఖ మంత్రి లోకేష్ మాత్రం విదేశాల్లో క్రికెట్ చూస్తూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. సమస్యలపై ప్రశ్నిస్తానన్న డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడ ప్రశ్నిస్తునారో అర్థంకావడం లేదన్నారు. విద్యార్థులు, యువకుల పక్షాన నిలబడి వారి సమస్యలపై న్యాయపోరాటం చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

# తప్పు చేసిన వారిని సమర్థించడం సిగ్గుచేటు

## వాస్తవాలు తెలియకుండా సురేష్ నాయుడు మాట్లాడటం అర్థరహితం

## మీడియా సమావేశంలో టీపీ గూడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దుర్గారావు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 13)




ప్రభుత్వ పాఠశాలలో సరస్వతి పూజ చేసుకుంటున్న సమయంలో అధికార పార్టీకి చెందిన కొందరు మద్యం సేవించి విద్యార్థులు, ఉపాధ్యాయులను బెదిరించి భయాందోళనకు గురిచేసి విధ్వంసం సృష్టించి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాల్సింది పోయి వారిని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని తోటపల్లి గూడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పామంచి దుర్గారావు అన్నారు. ఈ మేరకు గురువారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ మండలంలో జరిగిన ఘటన గురించి తెలియకుండా అధికార పార్టీకి చెందిన సురేష్‌నాయుడు బుధవారం కోడూరులో ప్రెస్‌మీట్ పెట్టి అనవసరమైన వ్యాఖ్యలు చేశారన్నారు. జరిగిన ఘటనలో తమ పార్టీకీ చెందిన వారు ఉంటే వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు. అధికార పార్టీకి చెందిన వారు కాబట్టి కేవలం నామమాత్రపు కేసుపెట్టించి చేతులు దులుపుకున్నారన్నారు. వైసీపీ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలోని టీపీ గూడూరు మండంలో అభివృద్ధి జరగలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. కోడూరు పంచాయితికి వస్తే సచివాలయాలు, ఆర్‌బీకేలు, రోడ్లు, డ్రైన్‌కాలువల నిర్మాణాలు తదితరవి జరిగిన అభివృద్ధి పనులు చూపిస్తామన్నారు. సురేష్ నాయుడు స్థాయి గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. సురేష్‌నాయుడు కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలిచాడో లేదో తెలీదు కాని మా నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురించి మాట్లాడటం చూస్తుంటే విడ్డూరంగా ఉందని ఆయన గురించి మాట్లాడే స్థాయి నీకు లేదు అని సూచించారు. సోమిరెడ్డి నీజేబు నింపితే వచ్చి మా నాయకుడు గురించి మాట్లాడుతున్నావని, ఇది సరికాదని సురేష్‌నాయుడుకి తెలిపారు. అధికారం ఉన్నా లేకపోయినా మా నాయకుడు కాకాణి పేదవాడి కోసం పోరాడుతున్నారన్నారు. ఇంకోసారి మా నాయకుడు గురించి లేనిపోని వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కంజి శ్రీరాములు, సురేష్, కొండూరు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న నగదు, బంగారు ఆభరణాలు

## అప్పగించిన మార్కాపురం పోలీస్

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మార్చి 13)

తక్కువ సమయంలో సీసీ కెమెరాల ద్వారా పోగొట్టుకున్న నగదు , బంగారు ఆభరణాలను బాధితులకు అప్పగించారు మార్కాపురం పోలీసులు. వివరాలలోకి వెళితే ఫిర్యాది మార్కాపురం మండలానికి చెందిన రామచంద్ర కోట గ్రామానికి చెందిన వెన్నా కాశి రెడ్డి తండ్రి కాశి రెడ్డి(37), టీచర్ వృత్తి, అతని భార్య ధనలక్ష్మిలు వారి స్వగ్రామమైన రామచంద్ర కోట నుంచి ఫిర్యాది భార్య ధనలక్ష్మి మార్కాపురం పట్టణంలోని అరవింద స్కూల్ వద్ద ఉంటున్న ఆమె అక్క కుమారి వద్దకు 12.03.2025న మధ్యాహ్నం సమయంలో వచ్చి, అదే రోజు రాత్రి సుమారు 7.45 గంటల సమయంలో ఫిర్యాది, అతని భార్య ఇద్దరూ కలసి వారి మోటార్ సైకిల్‌పై వారి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. అరవింద స్కూల్ వద్ద నుండి తూర్పు వీధి మీదుగా కమలా వెడ్డింగ్ మాల్ వద్దకు వెళ్లేసరికి, వారితో పాటు వారు తెచ్చుకున్న బంగారు ఆభరణాలు బంగారు నల్ల పూసల దండ ఒకటి సుమారు 1 తులం, బంగారు చైన్ సుమారు ఒకటి సుమారు 2 తులాలు, రూ.1,61,500 నగదు కలిగిన బ్యాగు దారి మధ్యలో ఎక్కడో పడిపోయినట్లు గుర్తించారు. వెంటనే వాటి గురించి చుట్టు పక్కల అంతా వెతికిననూ కనిపించక పోవడంతో ఫిర్యాది వెంటనే మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఫిర్యాది ఇచ్చిన రిపోర్ట్ మేరకు మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సుబ్బారావు ఆదేశాల మేరకు మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం సైదు బాబు, డాక్టర్ ఎం రాజ మోహన్ రావులు వారి సిబ్బందితో తూర్పు వీధిలోని వాగ్దేవి జూనియర్ కాలేజీ వారిచే వారి కాలేజి ఎదురుగా ఏర్పాటు చేయించిన సిసి కెమెరాలు పరిశీలించి చూడగా, సదరు ఫిర్యాది మోటార్ సైకిల్ పై వెళ్తుండగా వారి బ్యాగు జారి క్రింద పడగా, వెంటనే అటు వైపుగా వెళున్న తూర్పు వీధికి చెందిన లలితా కుమారి అనే మహిళ సదరు బ్యాగును తీసుకున్నట్లుగా గుర్తించి, సదరు మహిళ యొక్క ఇంటిని గుర్తించి సదరు మహిళ వద్ద నుంచి ఫిర్యాది పోగొట్టుకున్న బ్యాగు, అందులోని బంగారు ఆభరణాలు, నగదును చూడగా అవి అన్ని అలాగే ఉన్నాయి. వెంటనే మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. సుబ్బారావు ఫిర్యాదికి వారు పోగొట్టుకున్న నగదు, బంగారు ఆభరణాలను అప్పగించడం జరిగింది. ఈ మధ్యకాలంలో ఎస్పీ దామోదర్, మార్కాపురం పోలీస్ ఇచ్చిన అవగాహన కార్యక్రమాలలో భాగంగా వాగ్దేవి జూనియర్ కాలేజి వాళ్ళు వారి కాలేజికి ఎదురుగా సిసి కెమెరా లను ఏర్పాటు చేయడం ద్వారా ఫిర్యాది పోగొట్టుకున్న బ్యాగును కొద్ది గంటలలోనే స్వాధీనం చేసుకొని ఫిర్యాదికి అప్పచెప్పడం జరిగింది. అందుకు గాను మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సుబ్బారావు, వాగ్దేవి జూనియర్ కాలేజి యాజమాన్యాన్ని అభినందించడం జరిగింది. నగదు, బంగారు ఆభరణాలను అందుకున్న ఫిర్యాదుదారుడు కృతజ్ఞతా భావంతో మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 4 సిసి కెమెరాలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు అంగీకరించాడు. మార్కాపురం పట్టణ ప్రజలు, మార్కాపురం పోలీస్‌లకు సహకరించి పట్టణంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి దొంగతనాలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సహకరించాలన్నారు.





# ఆదాలను సత్కరించిన నెల్లూరు రూరల్ వైసీపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 13)
నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గురువారం నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం అధ్యక్షులుగా నియమితులైన సాదు పెంచల్ రెడ్డి, 23 వ డివిజన్ వైసీపీ ఉపాధ్యక్షులుగా నియమితులైన ఉండేలా నారాయణరెడ్డి తదితరులు మాజీ ఎంపీ ఆదాలను శాలువాలు కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి నూతనంగా పదవులు పొందిన నాయకులను అభినందించి సూచించారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి యనమల మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

## 26 మందికి రూ.42 లక్షల చెక్కులు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మార్చి 13)
యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 26 మందికి మొత్తం రూ.42,12,564ల చెక్కులను ఎరిక్షన్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గూడూరి ఎరిక్షన్ బాబుకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 13)



మండల పరిధిలోని పెదపట్టపుపాలెం హైస్కూలు నందు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పాఠశాల కమిటీ చైర్మన్ తిరుపతిరావు, గ్రామ సర్పంచ్ ఆవల జయరాం ఆధ్వర్యంలో హాల్ టికెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సలీం భాషా మాట్లాడుతూ పరీక్షలు నిజాయితీగా రాసి పాఠశాలకు మంచి ఫలితాలను సాధించవలసినదిగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైర్మన్, సర్పంచ్‌తోపాటు సోషల్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, గణిత ఉపాధ్యాయుడు హరిప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీనివాస కళ్యాణ మహోత్సవంలో పాల్గొనున్న మంత్రి ఆనం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 13)
నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గ పరిధిలోని కొండ బిట్రగుంటలో వెలసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల12న శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న శ్రీనివాస కళ్యాణం మహోత్సవ కార్యక్రమం లో స్థానిక ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి కలిసి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారు.

# రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)
బీహార్ రాష్ట్రం ఔరంగాబాద్‌కు చెందిన ప్రస్తుతం అద్దంకిలో నివాసముంటున్న సంజీవ కుమార్ (25) గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో ఒంగోలు రైల్వే స్టేషన్, కరవాది రహదారిలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య కారణాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతే లక్ష్యం

## 2030 నాటికి మూడు వేల టన్నుల ఉత్పత్తి
## ఏపీలో మొదటిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేసింది టీడీపీనే
## రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్లతో రైతులకు లబ్ధి
## ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మార్చి 13)**

దేశంలో విద్యుత్ సంస్కరణలను మొదటిసారి అమలు చేసింది తెలుగుదేశం పార్టీనే అని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏపీ అసెంబ్లీలో పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ శాఖపై జరిగిన లఘు చర్చలో భాగంగా గురువారం ఆయన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విషయాలను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గౌరవ సభ్యులకు వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాతే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలను ప్రారంభమయ్యాయని వెల్లడించారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ఈఆర్సీ ని తీసుకువచ్చింది కూడా ఏపీనే అని ఈ సందర్భంగా తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 1.85 లక్షల కోట్ల పెట్టుబడితో తో అనకాపల్లి జిల్లా పూడిమడకలో 1,200 ఎకరాల్లో గ్రీన్ హైడ్రోజన్ హాబ్ ప్రాజెక్టును ఎన్టీపీసీ, నెడ్ క్యాప్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న పేర్కొన్నారు. 2030 సంవత్సరం నాటికి మూడు వేల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎగుమతి లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు మంత్రి వివరించారు. రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీబీజీ ప్లాంట్ల నిర్మాణంతో రాష్ట్రంలోని రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. టాటా రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్‌తో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంత్రి నారా లోకేష్ గారి ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకున్న విషయాన్ని మంత్రి ఈ మేరకు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో రూ. 49 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 7000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాము. అదే విధంగా బ్యాటరీ స్టోరేజ్ సిస్టంను రాష్ట్రంలో తొలిసారి ప్రవేశపెడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం 55 సబ్ స్టేషన్లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్నట్లు మంత్రి సభలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏటా 6శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుందని, ఆ వినియోగానికి సమానమైన విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. ఏపీ జెన్కో ద్వారా రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. తద్వారా విద్యుత్ కొనుగోళ్లను కూడా 60 శాతానికి తగ్గించామని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పథకం వద్దని జగన్మోహన్ రెడ్డి కేంద్రానికి లేఖ రాస్తే... సూర్యఘర్ పథకం ద్వారా మరిన్ని కనెక్షన్లు కావాలని ప్రధాన మంత్రికి లేఖ రాసిన ఘనత సీఎం చంద్రబాబుది అన్నారు. అదే విధంగా పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. మొత్తం 4.5 లక్షల పీఎం కుసుమ్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో 9 సార్లు కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపారని ఆయన స్పష్టం చేశారు. జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం... లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఒక్క ఎకరాకూ.. చుక్క నీరు కూడా ఇవ్వలేదన్నారు. అదే విధంగా ట్రాన్స్ ఫార్మర్ల దొంగతనాలపై జిల్లా ఎస్పీలతో చర్చించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ వ్యవస్థను సర్వ నాశనం చేసిన జగన్, వైసీపీ నేతలు ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖకు సంబంధించి గౌరవ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# శిథిలావస్థలో ఓల్డ్ ఫిల్టర్ బ్యాండ్ తక్షణమే మరమ్మతులు చేయాలి

## కొత్త ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి నగరపాలక సంస్థ వెంటనే చర్యలు చేపట్టాలి
## సిపిఎం డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)**

సిపిఎం నాయకుల పాదయాత్ర గురువారం రాజా పానగల్ రోడ్డు,, గద్దలగుంట,,, మామిడిపాలెం ,,,సీతారాంపురం ,,జకరయ్య కాలనీ, యానాది కాలనీ, కొండమిట్ట, ప్రాంతంలో జరిగింది. ఈ సందర్భంగా కొండమిట్టలో ఉన్న ఓల్డ్ ఫిల్టర్ బెడ్ ని పరిశీలించింది. అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరానికి సగం మంది జనాభాకు ఇక్కడి నుంచి మంచినీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. 1968లో నిర్మాణం చేపట్టారు అన్నారు. సుమారు 57 సంవత్సరాలు పూర్తయిందన్నారు. స్లాబు, ఫిల్టర్‌లు కూడా పగిలిపోయి ఇనుము బయటికి వచ్చిందన్నారు. ఎప్పుడు బిల్డింగు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఈ భవనం ఉందన్నారు. ఏ క్షణమైన నిర్మాణం కూలిపోయే పరిస్థితిలో ఉన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే నగరపాలక సంస్థ ఫిల్టర్ బెడ్ మరమ్మత్తులు చేయడానికి నిధులు వెచ్చించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే సుమారు 57 సంవత్సరాల అయినందువలన అదే స్థలంలో మరో ఫిల్టర్ బెడ్డు ఏర్పాటు చేయాలన్నారు..ఈ ప్రమాదం జరిగితే ప్రజలందరికీ మంచినీరు అందని పరిస్థితి వస్తుందని, పాలకవర్గం యొక్క వైఫల్యం, అధికారులు శ్రద్ధ లేకపోవటం పాలకులు ప్రజల సమస్యల మీద శ్రద్ధ పెట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల మంచినీటి సమస్య పరిష్కారం పట్ల తగిన నిర్లక్ష్యంగా ఉన్నారు. అనంతరం ఈ ప్రాంతాల్లో మంచినీరు దుర్వాసనతో వస్తున్నాయని ప్రజలు యాత్ర పురం లిస్టు తీసుకువచ్చారు. కరెంటు బిల్లులు, భారంగా ఉందని అన్నారు. ఇళ్ల స్థలాలు టడ్కో ఇల్లు సంవత్సరాలు గడుస్తున్న కూడా పరిష్కారం కాలేదు కాలేదు. రెగ్యులర్‌లుగా కాలువలు, మురుగు తొలగించాలి.కరెంటు రేట్లు తగ్గించాలని నాయకులు తెలియజేశారు..వీటి కోసం జరిగే పోరాటంలో ప్రజలు పెద్ద ఎత్తున కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జీ రమేష్, బి రఘురాం, నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, నగర నాయకులు బివి రావు హుస్సేన్, మహేష్, షేక్ అమీర్, సిహెచ్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.






# 16న పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, మార్చి 13)**

యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఈ నెల 16వ తేదీన పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మెళా నిర్వహిస్తున్న యర్రగొండపాలెం సీఐ సిహెచ్ ప్రభాకర్ రావు తెలిపారు. గురువారం




ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పివిఎస్‌ఆర్ గ్రూప్స్ సీఈవో పామర్తి గోపిచంద్ సారథ్యంలో ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి పాసై వివిధ టెక్నికల్ కోర్సులు చేసిన వారందరూ ఉద్యోగాల కోసం ఈ నెల 16వ తేదీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అదే రోజు వివిధ కంపెనీల ఆధ్వర్యంలో ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆయన కోరారు.

# కరాటే యువ క్రీడాకారుడికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంస

## చంద్రబాబుకు పరిచయం చేసిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 13)**

కరాటేలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న పల్నాడు జిల్లా వినుకొండ మండలం పెదకంచర్ల గ్రామానికి చెందిన యువక్రీడాకారుడు రామినేని రోహన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఘనంగా సత్కరించారు. ఇటీవలే దక్షిణాఫ్రికా రాజధాని దర్బన్ వేదికగా జరిగిన కామన్‌వెల్త్ 11వ కరాటే ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న రోహన్‌కు ఏనుగు ప్రతిమ అందించి అభినందించారు సీఎం చంద్రబాబు. గురువారం ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వారిని తీసుకుని వెళ్లి ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. కొంతకాలంగా కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వరస విజయాలతో సత్తా చాటుతున్నాడు 15 ఏళ్ల యువ క్రీడాకారుడు రామినేని రోహన్. ఆ క్రమంలోనే 2024 నవంబర్ 28 నుండి డిసెంబర్ 1 వరకు దర్బన్ లో జరిగిన కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో తొలి అంతర్జాతీయ పతకం సాధించాడు. 63 కిలోల విభాగంలో అతడు స్వర్ణం గెలిచి విశ్వవేదికపై త్రివర్ణ పతాకను రెపరెపలాడించాడు. ఎలైట్ విభాగంలో స్వర్ణంతో పాటు క్లబ్స్ విభాగంలో కాంస్యం అందుకున్నాడు. అంతకు ముందు జాతీయ, జోనల్ స్థాయిలో పలు పతకాలు గెలుచుకుని కరాటేలో ప్రతిభ చూపాడు రోహన్. రోహన్ వెంట ఆయన తండ్రి రామినేని శివకృష్ణ, తాత రామినేని రామకోటయ్య, పెదనాన్నలు రామినేని పూర్ణచంద్రరావు, రామినేని సుబ్రమణ్యం ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు రోహన్ ఇలాంటి మరెన్నో విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, పల్నాడు ప్రాంతానికి, వినుకొండకు మరింత మంచిపేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు రాష్ట్రంలో ఉజ్వల భవిష్యత్ ఉండబోతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల తీసుకుని వచ్చిన నూతన క్రీడా విధానంతో ఇలాంటి వర్ధమాన, గ్రామీణ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఒకవైపు క్రీడా మౌలిక వసతుల పెంపు, మరోవైపు వివిధ పోటీల్లో గెలిచిన విజేతలకు ప్రోత్సాహం ద్వారా క్రీడారంగానికి ఊతం ఇవ్వాలన్నదే సీఎం చంద్రబాబు ఆలోచనగా తెలిపారు.





# మసీదులోని సీసీ కెమెరాలు ధ్వంసం చేసిన వ్యక్తి పై కేసు నమోదు



**(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 13)**

మండలంలోని కందులాపురం గ్రామపంచాయతీలోని హజరత్ బిలాల్ మసీదు పరిధిలోని ముస్లింలందరూ రెండు వర్గాలుగా ఏర్పడి వారిలో వారు మా ప్యానల్ ప్రెసిడెంట్‌గా ఉండాలని ఒక వర్గం లేదు. మా ప్యానెల్లే ప్రెసిడెంట్‌గా ఉండాలని, ఇంకొక వర్గం ఘర్షణ పడుతూ ఉండగా వారిలో ఒక వర్గానికి సంబంధించిన ఒక వ్యక్తి సీసీ కెమెరాలు ధ్వంసం చేయగా అతనిపైన కేసు రిజిస్టర్ చేయడం జరిగినదని, ఆ ఇరువురు పార్టీలను కంభం తహసీల్దార్ దగ్గర భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా బైండోవర్ చేసినట్లు కంభం ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

# యువ రచయితలుగా మారిన కమలా విద్యార్థులు

## పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్






**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మార్చి 13)**

స్థానిక కమలా హైస్కూలు (సి.బి.ఎస్.ఇ), మార్కాపురం నందు 8వ తరగతి విద్యార్థులు వివిధ అంశాల మీద 35 పుస్తకాలు రచించారు. గురువారం వారి యొక్క ప్రతిభను గుర్తించి "పుస్తక ఆవిష్కరణ" కార్యమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన గావించి, అనంతరం విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ పుస్తకాలు రచించడం అనేది అంత సులువైన విషయం కాదని, కమలా హైస్కూలు విద్యార్థులు, పుస్తకాలు రచించడం చూసి ఆశ్యర్యం వ్యక్తం చేసారు.. విద్యార్థుల యొక్క ప్రతిభను ప్రసం సిస్తూ, ఈ పుస్తకాలు రంచిచండంలో సహకరించిన వారి ఉపాధ్యాయులను, యాజమాన్యాన్ని అభినందించారు. సి.బి.ఎస్.ఇ పాఠశాలలో మాత్రమే ఇటువంటి పాఠ్య ప్రాణాళిక మరియు విద్యా ప్రమాణాలు ఉంటాయి అని వెల్లడించారు. విద్యార్థులు రచించిన ఈ పుస్తకాలు అమెజాన్‌లో కొనుగోలు చేయుటకు సౌలభ్యం కలదని పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వరూప్ రంజన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పి.పవన్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ .పి. సింధుజ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# గూడూరి ఎరిక్షన్ బాబుకి టీడీపీ నాయకులు, ఉపాధ్యాయుల సన్మానం



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మార్చి 13)**

మండలంలోని తంగిరాలపల్లిలోని ఎంపీయూపీ స్కూల్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేసేందుకు సహకరించిన యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుని టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబుకి కృతజ్ఞతలు తెలిపారు. హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేయండంతో విద్యార్థులకు, ప్రత్యేకించి బాలికలకు ఎంతో మేలు కలిగినట్లయిందని తెలిపారు.

# వైకాపా మద్యం కుంభకోణం పై ఈడీ విచారణకు ఆదేశించాలి

## - జగన్ అక్రమంగా దోచిన వేలకోట్లు - రికవరీ చేసి ప్రజలకు ఖర్చుపెట్టాలి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 13)

రాష్ట్రంలో అయిదేళ్ల వైకాపా ప్రభుత్వంలో మద్యం అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ - ఈడీ విచారణకు ఆదేశించాలని, జగన్ దోచుకున్న రూ.వేల కోట్లు రికవరీ చేసి ప్రజలకే ఖర్చు పెట్టాలని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. చత్తీస్‌గఢ్, దిల్లీ కంటే 10 రెట్లు ఎక్కువ స్థాయిలో ఏపీలో మద్యం కుంభకోణం చోటుచేసుకుందన్న ఆయన, అందుకు కారణమైన ప్రతిఒక్కరిపై చర్యలు తీసుకోవాలని ప్రభు త్వాని కోరారు. గురువారం ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చలో మాట్లాడిన చీఫ్ విప్ జీవీ మద్యపాలన నిషేధం చేస్తామనే హామీతో అధికారంలోకి వచ్చి అదే మద్యంలో వేలకో ట్లు దోచుకున్న ఘనుడు జగన్ అని ఎద్దేవా చేశారు. జేబ్రాండ్‌ల మద్యంతో వైకాపా నాయకులు ప్రజల ప్రాణాలు తీశారని, అవినీతి, దోపిడీకి బ్రాండ్ అంబాసిడర్లు అయ్యారన్నారు. ప్రజల ప్రాణాలు, ప్రజల ఆరోగ్యంపై అతి దుర్మార్గంగా వ్యాపారం చేశారని ధ్వజమెత్తారు. నాసిరకం మద్యం తాగి 40లక్షలమంది ఆస్పత్రి పాలయ్యారని, లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు. కొందరు ఇళ్లు, ఆస్తులు అమ్ముకున్నారని వాపోయారు. 33వేలమంది ప్రాణాలు కోల్పోయారని, ఆ విధ్వంసానికి కారణమైన వారందరిపై బెల్టు తీయాల్సిందేనని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే సీఐడీ దర్యాప్తులో రూ. 3,500 కోట్లకు పైగా అవినీతికి ప్రాథమిక ఆధారాలు దొరికాయని,, ఆ దిశగా మరింతలోతుగా తవ్వాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో క్వాలిటీ మద్యం క్వార్టర్ రూ.99 ఉంటే నాడు నాసిరకం మద్యం క్వార్టర్ రూ. 230 వరకు అమ్మారని, బెల్ట్‌షాపుల్లో మళ్లీ రూ.50 అదనంగా బాదారని గుర్తు చేశారు. డిజిటల్ లావాదేవీలు అనుమతించకుండా



తాడేపల్లి ప్యాలెస్‌లోకి గుట్టలుగా బ్లాక్ మనీ పోగు చేసుకున్నారని, వాటిని లెక్కపెట్టడానికే రోజుకు 29 కౌంటింగ్ యంత్రాలు, 200మం ది సిబ్బంది పని చేసేవారన్నారు. అంతర్జాతీయ బ్రాండ్లు ఉంటే నాసిరకం మద్యం తాగరని, పెద్ద బ్రాండ్లను కూడా అడ్డుకున్నారన్నారు. జే-బ్రాండ్ల మద్యం ప్రాణాంతకం అని పక్క రాష్ట్రాలు ఏపీ బ్రాండ్లను నిషేధించిన దుస్థితి తెచ్చారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మార్చుతున్నామన్నారు. 90శాతం వరకు బెల్టు షాపులను కూడా కట్టడి చేసినట్లు తెలిపారు. అయితే నూతన మద్యం విధానంలో 20% కమిషన్ వస్తుందని టెండర్లు వేసిన వారంతా ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారని, ఆ విషయంలో ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. గీత కార్మికులకు 10% కోటాతో 349 దుకాణాలు ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

# ‘బ్యాన్ ఆన్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్’ పై విద్యార్థులకు అవగాహన సదస్సు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)

ఒంగోలు పట్టణంలోని స్థానిక భాగ్యనగర్‌లో గల దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ‘స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర’ భాగంగా గురువారం ‘బ్యాన్ ఆన్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్’ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం మన ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్రమైన ముప్పు అని వివరించారు. విద్యార్థులు తమ కళాశాలలో,






పరిసర ప్రాంతాల్లో మరియు స్వగృహాల్లో ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదని ఆమె సూచించారు. పరిశు భ్రమైన మరియు ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా ప్రభుత్వ విధి విధానాలను పాటించాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే, ప్లాస్టిక్ వ్యర్థాలు నదులు, మైదానాలు, సముద్ర తీరాలను కలుషితం చేస్తూ, మానవులే కాకుండా పశు పక్షాదులకూ హానికరం అవుతున్నాయని వివరించారు. ప్రత్యేకంగా, ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, పర్యావరణాన్ని రక్షించేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని సూచించారు. ఈ క్రమంలో, విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, కాటన్ బ్యాగులు, కాగితపు సంచులను ఉపయోగించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ‘స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర’ కళాశాల అధికార్లు సిహెచ్ శ్రీనివాసులు, మన్నే శ్రీనివాసులు, కే వెంకటేశ్వర నాయక్, ఎం సుధరాణి, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సైతం ఈ అవగాహన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ మద్దతు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# మాలల సాంస్కృతిక కళా జాతరాలను జయప్రదం చేయండి

## మల్లెల వెంకటరావు పిలుపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)

మాలల సాంస్కృతిక కళా జాతరలను జయప్రదం చేయాలని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు కోరారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో వెమా యల్లయ్య ట్రస్ట్ చైర్మన్ వెమా శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష మాల



కుటుంబాలు హిందూ సాంప్రదాయ కళల పై ఆధారపడి జీవిస్తున్నారని, వీరికి నేటి వరకూ ప్రభుత్వాల నుండి ఎటువంటి ఆదరణ, పథకాలు అందలేదని అన్నారు. వీరికి ప్రభుత్వాల నుండి పెన్షన్స్, పక్కా గృహాలు, ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని, డిమాండ్‌లతో మార్చి16వ తేది ఆదివారం, సాయంత్రం 4 గంటలకు ఒంగోలు నెల్లూరు బస్టాండ్ దగ్గర వున్న అంబేద్కర్ కళా ఆడిటోరియంలో జరుగు మాలల సాంస్కృతిక కళా జాతరాలను అన్నివర్గాల వారు కుటుంబ సమేతంగా, వచ్చి తిలకించి కళా కారులను ప్రోత్సహించి,జయప్రదం చేయాలని పిలుపు నిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి.వెంగళరావు కార్యక్రమం నిర్వాహకులు, మాల మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ దండేల కృష్ణ, కవి, రచయిత చప్పిడి కోటేశ్వరరావు,మాల యువసేన జిల్లా అధ్యక్షులు మేడికొండ మురళీ మోహన్, మాల మహాసభ నాయకులు వేముల బాబూ డానియెల్, మాలమహాసభ కన్వీనర్ వేమా బాలకోటి, కో-కన్వీనర్ మట్టిగుంట రామాంజి, చప్పిడి స్వామి, మాల పెద్దలు పాల్గొన్నారు.

# నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని నెంబర్ 1గా నిలపనున్న కోటంరెడ్డి

## రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 13)



కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రాష్ట్రంలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నెంబర్ -1గా నిలుపుతాడని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. అభివృద్ధి పనులకు ఎక్కడి నుంచైనా నిధులు తెచ్చే కళ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ఉందని పేర్కొన్నారు. గత వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో బారాషాహీద్ దర్గా అభివృద్ధికి నిధులు కోసం పోరాటం చేశానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని బారాషాహీద్ దర్గా ముఖ్య ద్వారాలకు 85 లక్షల రూపాయల వ్యయంతో శంకుస్థాపన చేశామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ ఆనంద్, నగర కమీషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ తహసిన్ , టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి పనులకు ఎక్కడినుంచైనా నిధులు తెచ్చే కళ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి ఉందన్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రాష్ట్రంలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నెంబర్ 1 గా నిలుపుతాడని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ కొనియాడారు. బారాషాహీద్ దర్గాలో ముఖద్వారాలకు అడిగిన వెంటనే నిధులు ఇచ్చి పనులు చేపట్టామంటే దానికి ప్రధాన కారణం జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు నెల్లూరు రూరల్ ప్రజల పక్షాల ధన్యవాదాలు తెలియజేస్తున్నాని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. బారాషాహీద్ దర్గా అభివృద్ధికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనల మేరకు ప్రణాళికలు రూపొందింస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# గ్రామాలలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయండి



(షణ్ముఖ వెలుగు, నూజెండ్ల, మార్చి 13)

మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరు ఉమాదేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేసి ప్రతిరోజు ఎక్కువమంది ఉపాధి పనులు చేసే విధంగా ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రతి గ్రామ పంచాయతీకి ఒక్కొక్క ఫీల్డ్ అసిస్టెంట్ 15 వ్యవసాయ నీటి కుంటలను తీపించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఆంజనేయరాజు, టెక్నికల్ అసిస్టెంట్స్ భాస్కర్ రెడ్డి సతీష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం ప్రకటించిన ఎడిటర్స్ అండ్ జర్నలిస్టు యూనియన్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)

ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్టు యూనియన్ ప్రకాశం జిల్లా నూతన కమిటీ సమావేశం ఒంగోలు ఎంసీఏ భవనంలో నిర్వహించారు. గురువారం జిల్లా అధ్యక్షుడు ఉబ్బా అశోక్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షురాలుగా సిహెచ్ అశోక్, డి శైలజ, ఎస్‌కె హుమాయున్ భాష, ప్రధాన కార్యదర్శిగా సూడిదేల ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శిగా గడ్డం మారుతి, సహాయ కార్యదర్శి మద్దిరాల సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా మండ శ్రీనివాసరావు, కోశాధికారిగా కంచర్ల శివ, గౌరవ సలహాదారులు మేకపాటి మాల్యాద్రి, కార్యవర్గ సభ్యులు ఎస్ కే కాలేశావలి వలి, పి. శేషు, బొడ్డు శ్రీనివాసరావు, కోరుకొండ సుబ్బారావు, బచ్చు కోటేశ్వరరావు, బైరపనేని శ్రీనివాసరావు, ఈర్ల శ్రీనివాసరావు, సుబ్బయ్య తదితరులను సభ్యులుగా ప్రకటించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సమస్యల పట్ల వారి సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని అధ్యక్షుడు అశోక్‌బాబు వ్యవస్థాపక అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి కోరారు.

# కుల, మతాలకతీతంగా హెూలీ పండుగ జరుపుకోండి

## కంభం ఎస్ఐ బి నరసింహారావు



(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 13)

కంభం ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు కంభం ఎస్సై బి. నరసింహారావు. హెూలీ పండుగను హిందూ సంప్రదాయ పద్ధతిలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. హెూలీ పండుగ సందర్భంగా పట్టణ ప్రాంతంలో ప్రధాన కూడలిలో గాని, రహదారులు వెంబడి గాని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మత సామరస్యం పాటిస్తూ సంతోషకర వాతావరణంలో ప్రజలు పండగ జరుపుకోవాలని సూచించారు. హెూలీ పండుగ సందర్భంగా ఎదుటివారి మనోభావాలు దెబ్బతినేల వ్యవహరించవద్దని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కఠినమైన చర్యలు తీసుకున పడతాయని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని అలా వాహనాలు నడుపుతూ పట్టుబడిన తక్షణమే చర్యలు తీసుకున పడతాయని సూచించారు. హెూలీ పండగ సందర్భంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం లేదా ఎలాంటి అసాంఘిక సంఘటనలకు పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకున పడతాయని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా సాంప్రదాయ పద్ధతిలో ప్రజలందరూ సంతోషంగా ప్రశాంత వాతావరణంలో హెూలీ పండగ జరుపుకోవాలని సూచించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# మత సామరస్యం పాటిస్తూ పండుగ జరుపుకోవాలి

ప్రజలకు హెూళీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన
ఎస్పీ ఏ ఆర్ దామోదర్
మత సామరస్యం పాటిస్తూ
సంతోషకర వాతావరణంలో పండుగ జరుపుకోవాలి
హెూళీ పండగ రోజు సంప్రదాయ రంగులు ఉపయోగం ఆరోగ్యకరం
ఎదుటివారి మనోభావాలు దెబ్బతినేలా
వ్యవహరించొద్దు, ఇబ్బంది కలిగించవద్దు
మహిళల పట్ల మర్యాదగా ఉండాలి
ప్రధాన కూడలి, కాలనీలు, రహదారుల పై
సీసీ కెమెరాలతో పాటు డ్రోన్లు వినియోగిస్తున్నాం
రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటి, ఏవైనా సమస్యలకు కారణమైతే
చట్టపరమైన చర్యలు తప్పవు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)

జిల్లా ప్రజలందరికీ ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ గురువారం ఓ ప్రకటనలో హెూళీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ మత సామరస్యం పాటిస్తూ సంతోషకర వాతావరణంలో హెూళీ పండగ జరుపుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించకుండా ఇబ్బంది కలిగించకుండా పండుగ జరుపుకోవాలన్నారు. సంప్రదాయ పండుగలు ఏవైనా ప్రజలు కలిసి,మెలిసి ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలి అన్నారు. జిల్లాలోని ముఖ్యమైన పట్టణాలు, ప్రదేశాలు, కాలనీలు, రహదారులపై సిసి కెమెరాలు ఉండటంతో పాటు డ్రోన్ కెమెరాల నిఘా ఉన్నదని, వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని ఎస్పీ తెలిపారు. ఎవరైనా కించపరిచేలా లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం లేదా ఏవేని సమస్యలకు కారణమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి పండుగ పర్వదినాల సందర్భంగా ముఖ్యంగా యువత ఆదర్శంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలపై వేగంగా మరియు సైలెన్సర్లు తోలగించి పెద్ద శబ్దాలు చేసుకుంటూ వెళ్ళరాదన్నారు. ఎదుటివారిని ఇబ్బంది కలిగించవద్దని, మహిళల పట్ల మర్యాదగా ఉండాలని తెలిపారు. ప్రార్థనా మందిరాల వద్ద రంగులు చల్లవద్దు అన్నారు. పండుగ వేళ ఎవరైనా గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురి చేసిన కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ముస్లిం విద్యార్థుల కల నెరవేర్చిన గూడూరి ఎరిక్షన్ బాబుకు సన్మానం



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మార్చి 13)

యర్రగొండపాలెం పట్టణంలోని ఉర్దూ పాఠశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఉర్దూ హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేసేందుకు సహకరించిన యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ముస్లిం సోదరులు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఉర్దూ హై స్కూల్‌గా అప్ గ్రేడ్ చేయండంతో ముస్లిం విద్యార్థులకు ఎంతో మేలు కలిగినట్లాయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం పట్టణ టీడీపీ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి (మ్యాక్స్), తెలుగుయువత నాయకులు షేక్ వలి, షేక్ ఇలియాజ్, ఖలీల్, షేక్ అయ్యుబ్, షేక్ యూసుఫ్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

## కిలో పొగాకు ధర రూ.280

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 13)

మండలంలో చెరువుకొమ్మిపాలెం నుంచి మొత్తం బేళ్లు 177 తీసుకొని రాగా, 135 బేళ్లు కొనుగోలు చేశారు. 42 బేళ్లు తిరస్కరించారు. 26వ వేలం కేంద్రంలో గురువారం గరిష్ట ధర రూ.280 పలకగా, కనిష్ట ధర రూ.270 పలికింది. సరాసరి ధర రూ.277.28 పలికింది.

## నైపుణ్య అభివృద్ధి కేంద్రాల స్థాపనతో యువతకు మరిన్ని ఉద్యోగాలు



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మార్చి 13)

ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ రామాయపట్నం, ములపేట, మచిలీపట్నం పోర్ట్ వద్ద స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ఏర్పాటుకు సీడ్ ఆప్ చైర్మన్ దీపక్‌రెడ్డితో, సీఈఓ, ఆంధ్ర ప్రదేశ్ మారిటైమ్ బోర్డు, ఇతర అధికారులతో మంగళగిరి ఆఫీస్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దామచర్ల సత్య మాట్లాడుతూ సీడ్ ఆప్ సంస్థ ద్వారా నైపుణ్య అభివృద్ధి కేంద్రాల స్థాపనతో యువతకు మరిన్ని ఉద్యోగాలు కలిపించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగ కల్పనకు మారిటైమ్ సెక్టర్ నందు పెట్టవలసిన ట్రైనింగ్ కోర్సుల గురించి చర్చించారు. వీటితో పాటు కేంద్ర ప్రభుత్వం నుండి నైపుణ్య అభివృద్ధి సంస్థల స్థాపనకు కావాల్సిన నిధుల గురించి చర్చించారు. అలానే పలు అంశాలపై అధ్యయనం చేయవలసినదిగా అధికారులను సూచించారు.

## 400 మందికి అన్నప్రసాద వితరణ





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మార్చి 13)

కనిగిరి శ్రీ శిరిడి సాయిబాబా దేవస్థానంలో గురువారం మధ్యాహ్న హారతి అనంతరం 400 మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ప్రకాశం జిల్లా శిరిడి సాయి మందిరాల సమాఖ్య ట్రెజరర్ దేవకి సుబ్రహ్మణ్యం భాగ్యలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు సహకారాన్ని అందించారు. ప్రతి గురువారం జరిగే ఈ వితరణ కార్యక్రమానికి భక్తులు సహకరించాలని ఆలయ అధ్యక్షుడు కొప్పురపు సత్యాలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, వి.సి రామశాస్త్రి,ఈర్ల గురవయ్య, శ్రీరాం మురళి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, సాయి మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి ఏపీఎస్ఎస్‌డిసి కృషి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 13)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ ఎస్ డిసి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఆదేశముల మేరకు ఆంధ్రప్రదేశ్ లో ఉన్నటువంటి నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తున్నది. దీనిలో భాగముగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుంది. పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజి రావు మాట్లాడుతూ గురువారం ఎస్ కే బి ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, మాచర్ల, పల్నాడు జిల్లా నందు జాబ్ డ్రైవ్ ను నిర్వించడం జరిగింది. ఈ జాబ్ మేళా కు 5 కంపెనీలు హాజరు కాగా 118 మంది హాజరుఅయ్యారు అందులో 70 మంది ఉద్యోగాలకు ఏంపిక అయ్యారని తెలియజేశారు. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిధి, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, డి ఆర్. జె.లక్ష్మి కుమారి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ వారు ఈ జాబ్ మేళ ను మాచర్లలో నిర్వహించడం చాలా సంతోషకరం అని తెలియజేశారు మరియు నియామక పత్రలు అందుకున్న యువతకు అభినందలు తెలుపుతు, వారిని మరెన్ని ఉన్నత శిఖరాలను అందుకునే విధంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి యం. రవీంద్ర నాయక్, మాచర్ల స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఆర్. కిరణ్ నాయక్ సీడాప్ జాబ్స్ కో ఆర్డినేటర్ నని నాయక్,కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు మరియు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మొర్రి పిచ్చయ్య సేవలు మరువలేనివి

### పరీక్ష సామాగ్రి పంపిణీ చేసిన యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ

(షణ్ముఖ వెలుగు, రాచర్ల, మార్చి 13)

విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య సేవలు మరువలేనివని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గుమ్మా పాండు అన్నారు. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు, హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసి పరీక్ష సామాగ్రిని కొనుగోలు చేసి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పాండుకు గురువారం అందజేశారు. వీటిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యడవల్లిలో 10.వ తరగతి చదువుతున్న విద్యార్థులకు దాత పిచ్చయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పాండు మాట్లాడుతూ పిచ్చయ్య గతంలో ఈ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేశారని, ప్రతి ఏడాది ఈ పాఠశాలకు ఆర్థిక సహాయం చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ పిచ్చయ్య మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం పొందాలనని, ఇదే పాఠశాలలో 10 సంవత్సరాలు హిందీ ఉపాధ్యాయునిగా పనిచేశానని, ఆ సమయంలో పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశానని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మోటివేషన్ స్పీచ్ తెలియజేసి, పరీక్షలల్లో పాటించవలసిన మెలకువలు తెలిపారు. పాఠశాల సిబ్బంది పాల్గొని పిచ్చయ్యను అభినందించగా, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.



## దివ్యాంగుల విద్య - ఉపాధి ఆధారిత

### ప్రోత్సహకాల పై ఎంపీ మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 13)

దేశం, ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లాలో దివ్యాంగుల సంక్షేమానికి విద్య - ఉపాధి ఆధారిత ప్రోత్సహకాలు అందించుటకు ప్రభుత్వం గత 5 సంవత్సరాల నుంచి అమలు చేయుచున్న పథకాలు, లబ్దిదారులు, కేటాయించిన -వాడిన నిధులు అవగాహన పెంపు కార్యక్రమాల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి, బి యల్ వర్మ



సమాధానమిస్తూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం 19-04-2017 నుండి “రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిస్ అబిలిటీస్ ఆక్ట్ 2016” చట్టాన్ని అమలుచేయుచున్నదని, దివ్యాంగుల వైకల్యాలను 7 నుండి 21కి పెంచబడ్డాయని, ప్రభుత్వ ఉద్యోగాలలో 4 శాతం, ప్రభుత్వ ఉన్నత విద్యాలయాలో 5 శాతం, పేదరిక నిర్మూలన-అభివృద్ధి పథకాలలో 5 శాతం రిజర్వేషన్లు కల్పించ బడ్డాయని తెలిపారు. వికలాంగుల ఉపశమనం రాష్ట్రాల అంశమైనా, కేంద్రం దీనదయాల్ దివ్యాంజన్ రీ హాబిలిటేషన్ స్కీం క్రింద గత 5 సంవత్సరాలలో ప్రకాశం జిల్లాలో 3,157 మందికి రూ.1560 లక్షలు ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 24,948 మందికి రూ.10,786 లక్షలు ఇవ్వబడ్డాయని, స్కాలర్ షిప్ స్కీం క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 5,867 మందికి రూ.22.12 కోట్లు ఇవ్వబడగా, నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ స్కిల్ డెవలప్మెంట్ పథకం క్రింద రాష్ట్రంలో 1.42 కోట్ల మందికి రూ.157 కోట్లు - ప్రకాశం జిల్లాలో 5,340 మందికి రూ. 4166 లక్షలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. వీటితోపాటు, దివ్యాంగుల సంక్షేమానికి, ప్రభుత్వాలు అనేక పథకాలను ,కార్యక్రమాలను అమలు చేయుచున్నదని కేంద్ర మంత్రి తెలిపారు.

## వై.పాలెం నియోజకవర్గ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

### వైపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మార్చి 13)

సప్త వర్ణాల శోభితమైన పండుగ సలక్షణమైన పండుగ అని వసంత శోభతో పరిడవిల్లే నూతన వేడుక రంగుల కేళీ హోలీ అని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. హోలీ పండుగ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలు సంతోషంగా హోలీ జరుపుకోవాలని, ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.